
WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టె ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

RNI: APTEL/2020/79173 జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 105 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శుక్రవారం 5 జూన్ 2026 | వెల : 2-00



## మంచిని చెడుగా ప్రచారం చేయడమే

# వైసీపీ సిద్ధాంతం

- ప్రభుత్వం చేస్తున్న మంచి, కల్పిస్తున్న ఉపాధిపై దుష్ప్రచారమే వైఎస్సార్సీపీ విధానం
- బూటకపు ప్రచారంతో ప్రజలను నమ్మించే యత్నాలకు ఎక్కడికక్కడ చెక్ పెట్టాలని మంత్రులకు సూచన
- పాలన చేపట్టినప్పుడు శాఖల వారీగా శ్వేత పత్రాలు విడుదల చేశాం
- ఇప్పుడు సాధించిన ప్రగతిని అదే విధంగా వివరిద్దామని పిలుపు
- ఈ అవార్డులు అన్ని శాఖలకు స్ఫూర్తి

**అమరావతి, స్వర్ణసాగరం**

ప్రభుత్వం చేస్తున్న మంచి, కల్పిస్తున్న ఉపాధిపై దుష్ప్రచారమే గొడ్డలి పార్టీ అధినేత విధానమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. మంచి పనిని కూడా చెడు ప్రచారం చేయాలనే సిద్ధాంతంతోనే వైఎస్సార్సీపీ పార్టీ అధినేత ఉన్నందున ప్రజాప్రతినిధులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంత్రివర్గ సమావేశం ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. బూటకపు ప్రచారంతో ప్రజల్ని నమ్మించే యత్నాలకు ఎక్కడికక్కడ చెక్ పెట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వ 2 ఏళ్ల పాలనా విజయాలు ప్రజలకు శాఖల వారీగా మంత్రులు వివరించాలన్న సీఎం, ఈ నెల 28లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రైతుల్ని చైతన్య పరచాలి పాలన చేపట్టినప్పుడు శాఖల వారీగా శ్వేత పత్రాలు విడుదల చేశామని, ఇప్పుడు సాధించిన ప్రగతిని అదే విధంగా వివరిద్దామని పిలుపునిచ్చారు. పరిపాలనలో పారదర్శకత పెరిగిన విధానం ప్రజలకు అర్థం కావాలని మంత్రులకు సూచించారు. రాష్ట్రంలో పప్పు ధాన్యాల ఉత్పత్తి పెరిగిందని వెల్లడించారు. పంట మార్పిడి విధానాలపై రైతుల్ని చైతన్య పరచాలన్నారు. సముద్ర ఆహార ఉత్పత్తుల్లోనూ గణనీయ - మిగతా3లో

## లండన్ ఐ' తరహా రాజధానిలో

# 'అమరావతి ఐ' నిర్మాణం

- రూ. 547 కోట్లలో అమరావతిలో ప్రభుత్వ భవనాలు
- ఉపాధి పనులు 100 నుంచి 125 రోజులకు పెంపు
- ఏపీ కేబినెట్‌లో ఆమోదం
- వివరాలు వెల్లడించిన సమాచార శాఖ మంత్రి పార్థసారథి



## ప్రతిపక్షాల సమావేశానికి

# డీఎంకే దూరం

- 'ఇండి కూటమి'ని వీడుతోందా
- తమిళనాడులో కాంగ్రెస్, టీవీకే పొత్తుతో రగులుతున్న విభేదాలు
- తమ పార్టీ కార్యకర్తల మనోభావాలకు గౌరవం ఇచ్చి సమావేశానికి హాజరు కాబోమని ప్రకటించిన డీఎంకే
- లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవడానికి అనుమతించిన సచివాలయం

2



## ఢిల్లీ అగ్నిప్రమాద భవనంలో అనేక లోపాలు


- ఎమర్జెన్సీ ఎగ్జిట్, వెంటిలేషన్ లేదట!
- మాలవీయా నగర్ అగ్నిప్రమాదంలో వెలుగుచూసిన కీలక విషయాలు
- ప్రమాద సమయంలో మూసి ఉన్న భవనం పైకప్పు

2



## మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం

- నీట్ విద్యార్థిని బలవన్మరణంపై రాహుల్ స్పందన
- పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయి
- నీట్ విద్యార్థిని మరణం కేవలం బలవన్మరణం కాదు
- అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోరం
- నీట్ విద్యార్థినీ మరణంపై తీవ్రంగా స్పందించిన రాహుల్‌గాంధీ



# సైకిల్‌పై ప్రయాణిస్తా

- పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక సంకల్పం చేద్దాం: చంద్రబాబు
- పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత
- నేడు సైకిళ్ళు, ఈ-సైకిళ్లపై ప్రయాణిద్దాం
- ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటుదాం
- పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తా - 'ఎక్స్'లో సీఎం పోస్ట్

## ప్రపంచ క్రీడా వారసత్వంలో

# ఒక కొత్త అధ్యాయం

- తొలి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన మోదీ
- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- కోట్లాది మంది ప్రజలు యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవడం ఆనందంగా ఉంది
- "ప్రతి జీవన సంప్రదాయం కాలంతో పాటు కొత్త దశల్లోకి ప్రవేశిస్తుంది
- ఈ ప్రపంచ యోగాసన క్రీడల ఛాంపియన్‌షిప్ అటువంటి కొత్త దశకు నాంది పలుకుతుంది.

2



## మరోసారి డీలిమిటేషన్ బిల్లు..

# డీఎంకే, టీఎంసీ మద్దతు?



- వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.
- దేశంలోని ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల్లో బిల్లు పాస్ అయ్యేందుకు అవకాశాలు
- డీ లిమిటేషన్ పై తమ విధానంలో పునరాలోచన దిశగా డీఎంకే ఉన్నట్లు తెలుస్తోంది.
- జమిలి ఎన్నికల బిల్లును కూడా వీలైనంత త్వరగా ప్రవేశపెట్టి యోచనలో ప్రభుత్వం

2

## ఈఏఎఫ్ స్టీల్‌ప్లాంట్‌ను

# ఏపీలో నిర్మించండి



- నోవోస్టల్-ఎమ్ ఛైర్మన్‌తో మంత్రి లోకేశ్
- ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ నోవోస్టల్
- ఎం సంస్థతో లోకేశ్ కీలక భేటీ
- ఏపీలో స్టీల్ ప్లాంట్, రోలింగ్ మిల్లు ఏర్పాటుకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

2

**అమరావతి, స్వర్ణసాగరం**

రష్యాలో పర్యటిస్తున్న విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. ఇందులో భాగంగా రష్యాకు చెందిన ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ నోవోస్టల్ -- ఎం సంస్థ ఛైర్మన్ ఇవాన్ డెమ్చెంకోలతో మంత్రి లోకేశ్ సెయింట్ - మిగతా3లో

మాకలం - సామాన్యుడి బలం
RNI No : APTEL/2024/15906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# భారత్‌లో ముగ్గురు ఎబోలా వైరస్



ప్రపంచవ్యాప్తంగా ఎబోలా ఆందోళనల నేపథ్యంలో భారత్‌లోనూ వైరస్ కలకలం రేపింది. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఎబోలా వైరస్ అనుమానితులను గుర్తించడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కాంగో, ఇథియోపియా, ఉగాండా దేశాల నుంచి ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ అభిజిత్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ముగ్గురు వ్యక్తుల ఆచూకీని గుర్తింపు, వారి పర్యవేక్షించే ప్రక్రియ కొనసాగుతోంది. కేంద్ర సంస్థల నుంచి అందిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అయితే, ఇప్పటివరకు వారిలో ఎవరికీ ఎబోలా సోకినట్లు నిర్ధారణ కాలేదని తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా ఆ ముగ్గురు వ్యక్తులను గృహ నిర్బంధంలోనే వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొంది.

**భారత ప్రభుత్వం కీలక అడ్వైజరీ**

ఇదిలా ఉండగా కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం పౌరులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినా లేదా ఆ దేశాల మీదుగా వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ మంగళవారం ఓ ప్రకటన చేసింది. భారత్‌లో ఇప్పటివరకు ఎబోలా కేసులు ఏవీ నిర్ధరణ కాలేదని క్లారిటీ ఇచ్చింది. ఎవరైనా గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశం నుంచి వచ్చినా, లేదా ఆ దేశం మీదుగా ప్రయాణించినా జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని చెప్పింది. వెంటనే ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలని పేర్కొంది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడటంతో పాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని వివరించింది. ఈ సందర్భంగా అధికారుల సాయం కోసం 1075 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని వివరించింది.

**ఎయిర్?పోర్టుల్లో కఠిన తనిఖీలు**

అంతేకాకుండా, భద్రత, ముందు జాగ్రత్త చర్యగా ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కఠినమైన తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కఠిన తనిఖీలు చేపట్టారు. అలాగే సముద్ర ఓడరేవుల వద్ద కఠినమైన నిఘాను కొనసాగిస్తున్నారు. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలను అధిక ప్రమాదం ఉన్న దేశాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలను తప్పనిసరి చేశారు. అంతేకాకుండా, ఎబోలా అనుమానిత కేసులను ఎదుర్కోవడానికి ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, ఆసుపత్రులను సిద్ధం చేశాయి.

మరోవైపు కాంగో జాతీయ ప్రజారోగ్య సంస్థ నివేదిక ప్రకారం దేశంలో ఇప్పటివరకు 363 ఎబోలా కేసులు నమోదయ్యాయి. బుండిబుగ్యో వైరస్ కారణంగా 62 మంది మరణించినట్లు వెల్లడించింది. వ్యాధి సోకిన వారిని కనుగొనడంలో కొంత మెరుగుదల కన్పించినట్లు అధికారులు చెప్పారు. ఉగాండాలో కూడా 15 కేసులు నిర్ధరణ కాగా, ఒకరు మరణించారు. ఆఫ్రికా దేశాల్లో ఎబోలా కేసులు పెరుగుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు అప్రమత్తమయ్యాయి. అటు ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) దీనిని 'అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది.

ఇదిలా ఉండగా, హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడికి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. సూడాన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించగా అతడికి ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన వైద్యసిబ్బంది, అతన్ని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి జజవీదీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# ప్రతిపక్షాల సమావేశానికి డీఎంకే దూరం



దిల్లీ వేదికగా జూన్ 8న జరగనున్న 'ఇండి' కూటమి భేటీకి డీఎంకే దూరంగా ఉండనుంది. ప్రతిపక్షాల ఐక్యతను చాటేందుకు ఇండి కూటమి నేతలు జూన్ 8న దేశ రాజధానిలో సమావేశం కానున్నారు. అయితే, తమిళనాడులో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో డీఎంకేకు సంబంధాలు క్షీణించాయి. ఫలితంగా ఈ భేటీకి డీఎంకే నేతలు దూరంగా ఉండనున్నారు. ఈ సమావేశంలో సుమారు 17 ప్రతిపక్ష పార్టీలు పాల్గొనే అవకాశం ఉంది. ఈ భేటీలో చట్టసభల లోపల, బయట అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ విజయ్ నేతృత్వంలోని టీవీకేతో చేతులు కలపడం డీఎంకేకు ఆగ్రహం తెప్పించింది. ఇరు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇండి కూటమి భేటీకి, డీఎంకే గైర్హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

మరోవైపు కూటమితో అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. ఆమెతో పాటు ఇటీవల దాడికి గురైన టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొనే అవకాశం ఉంది. వీరితో పాటు పలు రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు సమావేశానికి హాజరుకానున్నారు.

**'మా కార్యకర్తల మనోభావాలకు గౌరవం ఇచ్చి'**

అయితే, తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమకు చేసిన ద్రోహానికి తమ పార్టీ కార్యకర్తలు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని డీఎంకే తెలిపింది. "డీఎంకే పార్టీ కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని, వాటికి గౌరవం ఇస్తున్నాం. ముఖ్యంగా కాంగ్రెస్ పాల్గొంటున్న సమావేశం కావడంతో జూన్ 8న దిల్లీలో జరగనున్న ఇండి కూటమి సమావేశంలో డీఎంకే పాల్గొనదు. అయితే, ఈ సమావేశానికి హాజరుకాకపోయినప్పటికీ, సమావేశంలో పాల్గొనే ఇతర పార్టీలు దేశ శ్రేయస్సుకు సంబంధించిన ఏవైనా అంశాలను ప్రస్తావిస్తే, వాటిపై ఎప్పటిలాగే తన గళాన్ని వినిపిస్తూనే ఉంటుంది" అని డీఎంకే పేర్కొంది.

**ఇకపై మేం ఇండి కూటమిలో భాగస్వాములం కాదు!**

మరోవైపు, తాము ఇకపై ఇండి కూటమిలో భాగస్వాములం కాదని, అందుకే ఈ సమావేశానికి హాజరుకావడం లేదుని డీఎంకే నాయకుడు టీకేఎస్? ఇళంగోవన్ పేర్కొన్నారు. డీఎంకేతో తమ బంధాన్ని తెంచుకుంటున్నామని కాంగ్రెస్ స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తమ కార్యకర్తలు తీవ్రంగా శ్రమించారని తెలిపారు.

"తాము టీవీకేతో కలిసి ముందుకు సాగుతున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూడా టీవీకేతోనే కలిసి పోటీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. దీని అర్థం వారు ఇకపై మాతో లేరని. అలాంటప్పుడు మేము ఇండి కూటమిలో ఎలా కొనసాగగలం? అందుకే మేము ఈ సమావేశానికి వెళ్లడం లేదు. కూటమిలో భాగంగా పోటీ చేసి గెలిచిన ఐదుగురు ఎమ్మెల్యేలు వారి వెంట ఉన్నారు. మేం వారికి ఒక రాజ్యసభ స్థానాన్ని కూడా కేటాయించాం. ఇన్ని చేసిన తర్వాత కూడా, ఆ ఎమ్మెల్యేలు కనీసం వచ్చి మా నాయకుడికి కృతజ్ఞతలు కూడా తెలుపలేదు. తాము టీవీకేతో వెళ్తున్నామని, ఇకపై డీఎంకేతో తమకు పొత్తు లేదని వారు ప్రకటించారు. సహజంగానే, ఇది మా కార్యకర్తల మనసులను తీవ్రంగా గాయపరిచింది. వారి గెలుపు కోసం మా కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారు. 28 నియోజకవర్గాల్లో వారు కాంగ్రెస్ అభ్యర్థుల కోసం శ్రమించారు. అందుకే మేం సమావేశంలో పాల్గొనం. అసలు ఇండి కూటమిలోని ఎన్ని పార్టీలు ఈ సమావేశంలో పాల్గొంటాయో వేచి చూద్దాం" అని ఇళంగోవన్ పేర్కొన్నారు.

**లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవనున్న డీఎంకే!**

ఇదిలా ఉండగా, లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి దూరంగా కూర్చోవడానికి డీఎంకేకు అనుమతి లభించింది. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం నుంచి అనుమతి లభించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామి కావటంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది. తమిళనాడులో కాంగ్రెస్ తమ మిత్రపక్షం కానందున లోక్‌సభలో తమ ఎంపీల సీటింగ్‌ను మార్చాలని గతనెలలోనే లోక్‌సభ సెక్రటేరియట్‌ను డీఎంకే కోరింది.

# మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం

నీట్ విద్యార్థిని బలవన్మరణంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయని మండిపడ్డారు. మోదీ హయాంలో నాశనమైన విద్యా వ్యవస్థకు భారతదేశ యువ తరం మూల్యం చెల్లిస్తోందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాకు చెందిన ఆకాంక్ష అనే నీట్ అభ్యర్థిని నీట్ అక్రమాలపై మానసికంగా ఒత్తిడికి గురై నాగపుర్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలపై రాహుల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "ఆకాంక్ష డాక్టర్ అయ్యి సమాజానికి సేవ చేయాలని ఆశపడింది. ఓ సాధారణ రైతు అయిన ఆమె తండ్రి, కుమార్తె కలను నిజం చేయడానికి కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా 3లక్షల అప్పు తీసుకున్నారు. నాగపుర్‌లో ఆమె శిక్షణ తరగతులకు వెళ్లేందుకు వీలుగా తండ్రి వంటవాడిగా ఉద్యోగం చేశారు. ఓ తండ్రిగా ఆయన చేయగలిగినదంతా చేశారు, కానీ నీట్ పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయింది. పరీక్ష రద్దు కావటాన్ని తట్టుకోలేక ఆకాంక్ష బలవన్మరణానికి పాల్పడింది. ఆకాంక్ష మరణం కేవలం బలవన్మరణం కాదు, అది ప్రధాని మోదీ హయాంలో అవినీతి, కుప్పకూలిన విద్యావ్యవస్థ చేసిన ఘోర పాపం. ఇక ధర్మేంద్ర ప్రధాన్ విషయానికొస్తే? ఆయన ఈనాటికీ తన పదవిలో గట్టిగా పాతుకుపోయి ఉన్నారు. అవే పాత కమిటీలు, బదిలీలు, విచారణలు. సంస్కరణలు లేవు న్యాయం లేదు." ఇదిలా ఉండగా, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్?టీఏ) నిర్వహించాల్సిన నీట్ (యూజీ) 2026 పరీక్షను మే 12న రద్దు చేశారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థి సంఘాల తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ఈ ఆరోపణలపై స్పందించిన ప్రతిపక్షాలు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్? చేశాయి. అయితే, నీట్? పరీక్షను తిరిగి జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వ్యవహారంలో సీబీఐ అధికారులు ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఐదుగురి నిందితులకు జూన్ 2 వరకు ఉన్న కస్టడీని 15 వరకు పొడిగిస్తూ మంగళవారం దిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మంగీలాల్ ఖటిక్, వికాస్ బివాల్, దినేశ్ బివాల్, యశ్ యాదవ్, ధనుంజయ్ లోఖండేల జ్యుడిషియల్ కస్టడీని పొడిగించాలని కోరుతూ సీబీఐ అభ్యర్థనను ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ అజయ్ గుప్తా అంగీకరిస్తూ తీర్పును వెలువరించారు. మరోవైపు, నీట్ యూజీ పునఃపరీక్షకు చదువుకోవడానికి పుస్తకాలు కావాలని కోరుతూ, పేపర్ లీక్ నిందితుడు యశ్ యాదవ్ దాఖలు చేసి న దరఖాస్తును మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. ఈ మేరకు నిందితుడి తరఫు న్యాయవాది పేర్కొన్నారు.

**ప్రధాన సూత్రధారి నివాసం కూల్చివేత**

ఇక, నీట్-యూజీ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్ పీవీ కులకర్ణి నివాసంపై మహారాష్ట్ర మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. బీడ్‌లోని షాహునగర్‌లో గతంలో తన పూర్వీకులు ఉన్న ఇంటి స్థలంలో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే, ఇటీవల పేపర్‌లీక్ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో ఆ కట్టడంపై స్థానిక మునిసిపల్ అధికారులు దృష్టి సారించి సర్వే నిర్వహించగా, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆయనకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుల్డోజర్‌తో ఆ ఆక్రమణలను తొలగించారు.

## మరోసారి డీలిమిటేషన్ బిల్లు.. డీఎంకే, టీఎంసీ మద్దతు?



**ఢిల్లీ:** పార్లమెంట్ ముందుకు మరోసారి డీలిమిటేషన్ బిల్లు వచ్చే అవకాశం ఉంది. దేశంలోని ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల్లో బిల్లు పాస్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయి. వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ సమీకరణాలు మారాయి. డీ లిమిటేషన్ పై తమ విధానంలో పునరాలోచన దిశగా డీఎంకే ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, తమ ప్రాతినిధ్యం తగ్గకుండా ఉంటే వ్యతిరేకించాల్సిన అవసరం లేదని డీఎంకె వర్గాలు అంటున్నాయి. డీఎంకే నేతలతో అంతర్గతంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వాజ్‌పేయీ మంత్రివర్గంలో డీఎంకే భాగస్వామిగా ఉంది. తమిళనాడులో డీఎంకేకు కాంగ్రెస్ పార్టీ గుడ్‌బై చెప్పడంతో పరిణామాలు మారాయి. డీ లిమిటేషన్ బిల్లుకు పలువురు టీఎంసీ ఎంపీలు కూడా సహకరించే అవకాశం ఉంది. డీఎంకే, టీఎంసీ పార్టీలకు లోక్ సభలో 50 మంది ఎంపీలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 50 శాతం లోక్ సభ, 50 శాతం అసెంబ్లీ సీట్లు పెంచేలా డీ లిమిటేషన్ బిల్లును రూపొందించారు. గత ప్రత్యేక సమావేశాల్లో 54 ఓట్ల తేడాతో బిల్లు వీగిపోయింది. జమిలి ఎన్నికల బిల్లును కూడా వీలైనంత త్వరగా ప్రవేశపెట్టి యోచనలో ప్రభుత్వం ఉంది. వర్షాకాల సమావేశాల తొలి వారంలో జేపీసీ నివేదికను వన్ నేషన్ వన్ ఎలక్షన్ కమిటీ ప్రవేశపెట్టనుంది. రెండు దశల్లో దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించేలా ప్రతిపాదనలు ఉన్నాయి

## బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల

ఢిల్లీ: బీజేపీ రాజ్యసభ సభ్యుల జాబితాను విడుదల చేసింది. మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజనీష్ అగర్వాల్, గుజరాత్ నుంచి రాజుభాయ్ శుక్లా, ముకేశ్ భాయ్ రత్వ, మాన్సింగ్, జితేంద్ర మేక్జి భాయ్, మణిపూర్ నుంచి శారదా దేవి, రాజస్థాన్ నుంచి ఆల్క గుర్జర్, సతీష్ పునియా ,ఒడిశా నుంచి దేభాషిస్ సమంతరే, లు పోటీ చేయనున్నట్లు పార్టీ ప్రకటించింది. కాగా ఇటీవలే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18న పెద్దల సభకు ఎన్నికలు జరపనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అదే రోజున ఫలితాలుంటాయి. దేశవ్యాప్తంగా 24 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.నామినేషన్ దాఖలుకు జూన్ 8 చివరితేదీ కాగా జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జూన్ 11 వరకూ విత్‌డ్రాకు సమయముంటుంది. జూన్ 20తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తోంది

## ప్రపంచ క్రీడా వారసత్వంలో ఒక కొత్త అధ్యాయం

తొలి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ 2026ను ప్రారంభించారు ప్రధాని నరేంద్ర మోదీ. ఒలింపిక్స్‌తో సహా అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లలో యోగాసనానికి భవిష్యత్తులో చోటు దక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ క్రీడా వారసత్వంలో ఒక కొత్త అధ్యాయం చేరిందని అభిప్రాయపడ్డారు. కోట్లాది మంది ప్రజలు యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్?లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో వర్చువల్?గా పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ యోగా దినోత్సవానికి కొన్ని రోజుల ముందు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

"ప్రతి జీవన సంప్రదాయం కాలంతో పాటు కొత్త దశల్లోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రపంచ యోగాసన క్రీడల ఛాంపియన్‌షిప్ అటువంటి కొత్త దశకు నాంది పలుకుతుంది. ఈ ఛాంపియన్‌షిప్ ద్వారా యోగాసనం ఒక పోటీ క్రీడగా గుర్తింపు పొందుతుంది. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో గానీ లేదా ఇతర బహుళ క్రీడా పోటీల్లో, అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లలో యోగాసనం తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటుందని నేను విశ్వసిస్తున్నాను. ఐక్యరాజ్యసమితిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం భారత్? చేసిన ప్రతిపాదనకు ఆ సమయంలో 190 దేశాలు మద్దతు ఇచ్చాయి. నేడు లక్షలాది మంది ప్రజలు యోగాను తమ దినచర్యలో ఒక భాగంగా చేసుకున్నారు. ధ్యానం, ప్రాణాయామం వారి జీవనశైలిలో అంతర్భాగంగా మారుతున్నాయి. యోగాసన క్రీడలు విస్తరించే కొద్దీ, కొత్త అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇది క్రీడాకారులతో పాటు శిక్షకులు, పరిశోధకులు, ఈవెంట్ నిర్వాహకులకు కూడా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది."

"అహ్మదాబాద్ గడ్డ నుంచి ప్రపంచ క్రీడా వారసత్వంలో మరో కొత్త అధ్యాయం చేరింది. మొట్టమొదటి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ ప్రారంభమవుతోంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి ఇక్కడకు వచ్చిన వివిధ దేశాల క్రీడాకారులందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను. అహ్మదాబాద్ ఒక యునెస్కో ప్రపంచ వారసత్వ నగరం. ఇంతటి చారిత్రక నగరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం యావత్ దేశానికి ఎంతో గర్వకారణం. కొద్ది రోజుల్లోనే, జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని కూడా జరుపుకోబోతున్నాం. ఆ రోజున ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో యోగా సంబంధిత కార్యక్రమాలు జరుగుతాయి. వీటిలో ప్రధాన కార్యక్రమం మరో చారిత్రక భారతీయ నగరమైన కోల్‌కతాలో జరగనుంది. ప్రపంచ యోగా దినోత్సవానికి కొద్ది రోజుల ముందే జరుగుతున్న ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తోంది." అని ప్రధాని మోదీ అన్నారు.

ఈ క్రమంలోనే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్? 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా'ను ప్రధాని మోదీ ప్రస్తావించారు. దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఒక ప్రభావవంతమైన మార్గాన్ని అందిస్తుందని అన్నారు. రోజూ యోగా చేయడం వల్ల అన్ని వ్యాధులు దూరమవుతాయని అభిప్రాయపడ్డారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ 'యోగా 365' ప్రచారాన్ని ప్రారంభించిందన్న ఆయన, అంతర్జాతీయంగా పాల్గొనేవారు యోగా సందేశాన్ని తమతో పాటు తిరిగి తీసుకువెళ్లాలని కోరారు. "ఈ ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. మీరు మీ దేశాలకు తిరిగి వెళ్లినప్పుడు, ఈ యోగా దేశాన్ని మీతో పాటు తీసుకువెళ్లండి. మీరందరూ మీ దేశాల్లో 'యోగా 365'కి రాయబారులుగా మారండి. మీ అనుభవాలు, యోగాపై మీకున్న విశ్వాసం ఈ సందేశంతో ప్రపంచం మొత్తాన్ని అనుసంధానిస్తాయి. ఈ పోటీలో ఎవరు విజేతగా నిలిచినా చరిత్రలోని ఈ ముఖ్యమైన అధ్యాయంలో భాగం కావడం ద్వారా, మీరందరూ ఇప్పటికే ఛాంపియన్‌లుగా నిరూపించుకున్నారు." అని ప్రధాని మోదీ అన్నారు.

## దిల్లీ అగ్నిప్రమాద భవనంలో అనేక లోపాలు

దిల్లీ మాలవీయ నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదం దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. మంటలు చెలరేగినప్పుడు భవనం పైకప్పు మార్గం మూసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కారణంగానే లోపల ఉన్నవారు ప్రాణాలతో తప్పించుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఇంకా అనేక లోపాలను కూడా అధికారులు గుర్తించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఘటన జరిగిన తర్వాత పోలీసులు గెస్ట్ హౌస్‌లోని గదుల్లో సోదాలు నిర్వహించి దాదాపు 50 నుంచి 60 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో సుమారు 30 పాస్‌పోర్ట్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, దర్యాప్తు సమయంలో భవనం భద్రతా, మౌలిక సదుపాయాల్లో అనేక తీవ్రమైన లోపాలను కూడా అధికారులు గుర్తించారు. భవనం కిటికీలు, గ్లాసులు పూర్తిగా మూసివేసి ఉన్నాయని, ఫలితంగా పొగ బయటకు వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకుండా పోయిందని అధికార వర్గాలు తెలిపాయి.

# మార్కెట్లోకి మోటరోలా ఎడ్జ్ 70 ప్రో ప్లస్

స్వర్ణసాగరం విజయవాడ:

మొబైల్ సాంకేతికత, ఆవిష్కరణలలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన మోటరోలా సంస్థ 2026 సంవత్సరానికి చెందిన అత్యంత స్టైలిష్ ఫ్లాగ్‌షిప్ కిల్లర్ స్మార్ట్‌ఫోన్ మోటరోలా ఎడ్జ్ 70 ప్రోం ను గురువారం భారత మార్కెట్లో విడుదల చేసింది. ఆధునిక కెమెరా వ్యవస్థ, శక్తివంతమైన పనితీరు, ఆకర్షణీయమైన రూపకల్పనతో ఈ ఫోన్ వినియోగదారులకు ప్రీమియం అనుభూతిని అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. రూ.44,999 ధరతో అందుబాటులోకి వచ్చిన ఈ స్మార్ట్‌ఫోన్‌లో మోటో ఏఐ సాయంతో పనిచేసే నాలుగు 50 మెగాపిక్సెల్ ప్రో-గ్రేడ్ కెమెరాల వ్యవస్థ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తక్కువ వెలుతురులోనూ స్పష్టమైన చిత్రాలను అందించే 50 మెగాపిక్సెల్ సోనీ లిటియా 710 ప్రధాన కెమెరా, 3.5 రెట్లు పెరిస్కోప్ టెలిఫోటో కెమెరా, 50 రెట్లు కృత్రిమ మేధ సూపర్ జూమ్ ప్రో, 50 మెగాపిక్సెల్ అల్ట్రా వైడ్ మరియు మాక్రో విజన్ కెమెరా, ఆటో ఫోకస్ సదుపాయంతో కూడిన 50 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా ఈ ఫోన్‌లో ఉన్నాయి. అలాగే ఆప్టికల్ ఇమేజ్ స్థిరీకరణ సాంకేతికత వల్ల తక్కువ వెలుతురులోనూ మెరుగైన చిత్రాలు, స్థిరమైన వీడియోలు చిత్రీకరించవచ్చని సంస్థ తెలిపింది. ఈ ఫోన్‌లో అత్యాధునిక మీడియాటెక్ డైమెన్సిటీ 8500 ఎక్స్‌ట్రీమ్ ప్రాసెసర్ ఉండగా, కృత్రిమ మేధ ఆధారిత ప్రత్యేక ఫీచర్లు వేగవంతమైన పనితీరును అందిస్తాయి. 144 హెర్ట్జ్ 1.5కే ట్రూ కలర్ క్వాడ్ కర్వ్డ్ డిస్‌ప్లే, 90 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్, 15 వాట్ల వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయం, భారీ 6500 ఎంఏహెచ్ సిలికాన్-కార్బన్ బ్యాటరీ ఈ ఫోన్ ప్రత్యేకతలుగా నిలుస్తున్నాయి. అదనంగా నీరు, ధూళి నిరోధక సామర్థ్యంతో కూడిన ఐపీ68, ఐపీ69 రక్షణ, సైనిక ప్రమాణాల మన్నిక, ప్రత్యేక రంగులలో అందుబాటు వంటి హంగులతో ఈ ఫోన్ వినియోగదారులను ఆకట్టుకోనుంది. అత్యాధునిక సాంకేతికతను సరసమైన ధరలో అందిస్తూ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో మోటరోలా ఎడ్జ్ 70 ప్రో ప్లస్ కొత్త ప్రమాణాలు సృష్టించనుందని టెక్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# ఎఫ్‌టీపీసీ ఇండియాకు ఐసీఎంఈఐ గుర్తింపు

**ఇంద్రియ జ్యుయలర్స్ వేదికగా ఘనంగా విజయోత్సవ కార్యక్రమం**

**ముఖ్య అతిథిగా బాలీవుడ్ నటి అనీషా ముఖర్జీ హాజరు**

విజయవాడ, స్వర్ణసాగరం

ఎఫ్‌టీపీసీ ఇండియా మరో అంతర్జాతీయ గుర్తింపును అందుకొని తన కీర్తి కిరీటంలో మరో కలికితురాయిని చేర్చుకుంది. అంతర్జాతీయ మీడియా, వినోద రంగాలకు చెందిన ప్రతిష్టాత్మక సంస్థ 'ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ' (ఐసీఎంఈఐ) నుంచి గుర్తింపు లభించిన సందర్భంగా గురువారం ఎంజీ రోడ్డులోని ఇంద్రియ జ్యుయలర్స్ వేదికగా ఘనంగా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ ప్రెసిడెంట్ చైతన్య జంగా మాట్లాడుతూ, ఎఫ్‌టీపీసీ ఇండియాకు లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు సంస్థ ప్రతిష్టను మరింత పెంచుతుందని తెలిపారు. మీడియా, చలనచిత్ర, వినోద, వ్యాపార రంగాల్లో సంస్థ చేస్తున్న సేవలకు అంతర్జాతీయ స్థాయిలో లభించిన గుర్తింపుగా దీనిని



అభివర్ణించారు. ఈ గుర్తింపు ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలతో భాగస్వామ్యాలు పెరగడంతో పాటు కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి కోసం సభ్యులు, ప్రతినిధులు చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని అన్నారు. ప్రతిభను ప్రోత్సహించడం, యువతకు అవకాశాలు కల్పించడం, వివిధ రంగాల మధ్య సమన్వయం పెంపొందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సంస్థ సేవలను విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సంస్థ జనరల్ సెక్రటరీ వీఎస్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ, ఐసీఎంఈఐ గుర్తింపు ఎఫ్‌టీపీసీ ఇండియాకు కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చిందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయి సంస్థలతో అనుసంధానం పెంచి సభ్యులకు మరిన్ని అవకాశాలు కల్పించడంపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ బాలీవుడ్ నటి అనీషా ముఖర్జీ మాట్లాడుతూ, భారతీయ ప్రతిభను ప్రపంచ వేదికపై నిలబెట్టేందుకు ఎఫ్‌టీపీసీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. సృజనాత్మక రంగాల్లో ముందుకు రావాలనుకునే యువతకు ఎఫ్‌టీపీసీ ఇండియా వంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐ టీ వింగ్ చైర్మన్ కోడె చైతన్య,సినీ నిర్మాత ఈశ్వర్ మిత్తాన, ఫోటోగ్రఫీ చైర్మన్ రామిశెట్టి అప్పారావు, హాస్పిటాలిటీ కమిటీ సభ్యులు ఇమ్మానుయేల్ పోకల్కర్, జన్ను పవన్ కుమార్, ఇంద్రియ జ్యావిలరీ ఫ్లోర్ మేనేజర్ నవీన్, పలువురు మీడియా, వ్యాపార, వినోద రంగాలకు చెందిన ప్రముఖులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎఫ్‌టీపీసీ ఇండియాకు లభించిన అంతర్జాతీయ గుర్తింపును పురస్కరించుకొని విజయోత్సాహం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

## సైకిల్‌పై ప్రయాణిస్తా

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. భూమి మన ఇల్లు-ప్రకృతి మన జీవనాధారమని అన్నారు. పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దామని కోరారు. ఈ మేరకు సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు తెలిపారు. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేపు (జూన్ 5)న సైకిళ్లు, ఈ - సైకిళ్లపై ప్రయాణిద్దామని సీఎం పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదామన్నారు. రేపు విశాఖ పర్యటనలో భాగంగా తాను సైకిల్‌పై ప్రయాణించి, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. మంచి కార్యక్రమానికి అందరూ కలిసి రావాలని సీఎం చంద్రబాబు కోరారు.

**మహోత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేపు (శుక్రవారం) మహోత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టనుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టనుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రేపు బాధ్యతగా సైకిల్ వినియోగించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నంలో సైకిల్ ప్రయాణం చేయనున్నారని తెలిపారు.

**చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది**

ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కొంటోందని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని వెల్లడించారు. ప్రజలు కూడా సైకిల్ యాత్రలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం, ఇంధన వినియోగం తగ్గుతుంది, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు నేను సైతం**

'నా దేశం - నా బాధ్యత'లో భాగంగా ప్రతీ ఒక్కరూ ఇంధన వినియోగం తగ్గించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఇంధన సంక్షోభం దృష్టిలో పెట్టుకునే ఈసారి మహానాడు హైబ్రిడ్ విధానంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ సాధించామన్నారు. ప్రజలందరూ సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు నేను సైతం అంటూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ముఖ్య ఉద్దేశం : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏటా జూన్ 5న ఘనంగా జరుపుకుంటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించడం, పర్యావరణాన్ని కాపాడేందుకు సత్వర చర్యలు చేపట్టేలా ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులను ప్రోత్సహించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

## ఈఏఎఫ్ స్టీల్‌ప్లాంట్‌ను ఏపీలో నిర్మించండి

-మొదటిపేజీ తరువాయి

పీటర్స్ బర్గ్‌లో కీలక సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలను లోకేశ్ వివరించారు. దేశంలో వేగవంతమైన పర్యావరణ అనుమతులు, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాల మార్కెట్ మద్దతుతో భారత్ దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉన్నత శ్రేణి రీబార్, వైర్ రాడ్‌లను తయారుచేసే ఒక అత్యాధునిక ఈఏఎఫ్ స్టీల్ ప్లాంట్‌ను ఏపీలో నిర్మించాలని డెమ్చెంకోకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీలో ప్లాంట్లకు ప్రతిపాదనలు: రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామిక హబ్ శ్రీసిటీలో తక్షణ రైల్వే సైడింగ్ కనెక్టివిటీతో కూడిన స్ట్రక్చరల్ సెక్షన్, రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. అలాగే, చెన్నై--బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని ప్రాంతీయ ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు నేరుగా మెటీరియల్ సరఫరా చేసేలా ఒక ప్రత్యేకమైన హార్డ్‌వేర్ గాల్వనైజ్డ్ వైర్ ఫ్యాక్టరీని నిర్మించాలని ప్రతిపాదించారు. దీనితో పాటు నోవోస్టల్-ఎమ్ సప్లయ్ చైన్ భాగస్వామ్యంతో, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌లతో కూడిన ముడి పదార్థాల లాజిస్టిక్స్ హబ్‌ను అభివృద్ధి చేయడానికి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. భారత్?లోని సౌర, పవన విద్యుత్ కారిడార్లతో అనుసంధానిస్తూ లో-కర్బన్ ఉక్కు తయారీలో సహకార భాగస్వామ్యం వహించాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఇవాన్ డెమ్చెంకో లోకేశ్?కు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా మరోవైపు ప్రపంచస్థాయి సాఫ్ట్?వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇచ్చేందుకు, స్బేర్ బ్యాంక్ గేమిఫైడ్, పీర్-టు-పీర్ "స్కూల్ 21" కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యాకేంద్రాలలో ఏర్పాటు చేయాలని లోకేశ్? కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూర ప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

## మంచిని చెడుగా ప్రచారం చేయడమే వైసీపీ సిద్ధాంతం

-మొదటిపేజీ తరువాయి

ప్రగతి సాదించే దిశగా చర్యలు చేపడుతున్నాట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా వట్టి చెరుకూరులో 22ఏ భూ సమస్య పరిష్కారం చేసినట్లే ఇతర ప్రాంతాల్లోనూ సమస్యలను కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటులో జాప్యంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ సిటీలో బిజినెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పని చేసుకుంటూ ఉన్నత చదువులు చదువుకునేందుకు వీలుగా యూనివర్సిటీ ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 3 గంటల పాటు కేబినెట్ భేటీ సాగింది. అది ముగిసిన తర్వాత సీఎం మంత్రులతో పలు అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి నేటి వరకు ప్రజలకు అందించిన ప్రత్యేక పథకాల ఫలాలను అందరికీ చేరేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

**ఈ అవార్డులు అన్ని శాఖలకు స్ఫూర్తి**

మంత్రివర్గ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాగానే సహచర మంత్రులు నిలబడి చప్పట్లు కొట్టారు. విధ్వంస పాలనకు ప్రజలు చెక్ పెట్టి ఫలితాలు వచ్చి నేటికి 2ఏళ్లు పూర్తైన సందర్భంగా సీఎంకు మంత్రులు అభినందనలు తెలిపారు. పంచాయతీ రాజ్? శాఖకు వివిధ విభాగాల్లో వచ్చిన కేంద్ర అవార్డులను కేబినెట్?లో అధికారులు ప్రదర్శించారు. పంచాయతీరాజ్ శాఖకు అవార్డులపై ఆ శాఖ అధికారులను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. శుభాకాంక్షలు తెలిపారు. అన్ని శాఖలు అత్యుత్తమ పనితీరు కనబరిచేందుకు ఈ అవార్డులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. స్వల్ప అనారోగ్యం కారణంగా తాను కూర్చోలేకపోతున్నానని చంద్రబాబుకు చెప్పి ఉపముఖ్యమంత్రి కేబినెట్ మధ్యలోనే వెళ్లిపోయారు.

## మెటా-వి భాగస్వామ్యంతో సురక్షిత డిజిటల్ వెరిఫికేషన్

స్వర్ణసాగరం విజయవాడ

మెటా ప్లాట్‌ఫామ్‌లైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వినియోగదారులకు మరింత సురక్షితమైన, వేగవంతమైన, నిరాటంకమైన వెరిఫికేషన్ సేవలు అందించేందుకు వొడాఫోన్ ఐడియా (వి) సంస్థ మెటాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా నెట్‌వర్క్ ఆధారిత అథెంటికేషన్ సొల్యూషన్ 'సైలెంట్ మొబైల్ వెరిఫికేషన్'ను ప్రవేశపెట్టినట్లు సంస్థ ప్రకటించింది. కొత్త యూజర్ రిజిస్ట్రేషన్, మొబైల్ నంబర్ వెరిఫికేషన్, లాగిన్, రీ-లాగిన్, అకౌంట్ రికవరీ, సెక్యూరిటీ చెక్స్ వంటి సందర్భాల్లో ఈ సదుపాయం ఉపయోగపడనుంది. వినియోగదారులు స్వయంగా వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేకుండా, ఇతర యాప్‌లకు మారకుండా లేదా ఓటీపీ సందేశాల కోసం వేచి చూడకుండా, బ్యాక్‌గ్రౌండ్‌లోనే మొబైల్ నంబర్‌ను ధృవీకరించే విధంగా ఈ సాంకేతికత పనిచేస్తుంది. వి వినియోగదారులు తమ మొబైల్ నెట్‌వర్క్ ద్వారా మెటా యాప్‌లను ఉపయోగిస్తున్నప్పుడు వెరిఫికేషన్ ప్రక్రియ టెలికాం నెట్‌వర్క్ ద్వారానే నేరుగా పూర్తవుతుందని సంస్థ తెలిపింది. దీని వల్ల యాప్‌లలో వేగంగా లాగిన్ కావడం, పదేపదే వివరాలు నమోదు చేయాల్సిన అవసరం తగ్గడం, ఫిషింగ్, డిజిటల్ గుర్తింపు దొంగతనం వంటి ముప్పుల నుంచి మెరుగైన రక్షణ లభిస్తుందని పేర్కొంది. దేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ వ్యవస్థలో సైబర్ భద్రత, నమ్మకమైన అథెంటికేషన్ ప్రక్రియలకు ఈ సాంకేతికత తోడ్పడుతుందని సంస్థ అభిప్రాయపడింది.

## ప్రజల మనిషి రౌతు రామకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు



స్వర్ణసాగరం వాకాడు, జూన్ 4:

ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న వాకాడు మండల జడ్పీటీసీ రౌతు రామకృష్ణ జన్మదిన వేడుకలు వాలమేడు గ్రామంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన రౌతు రామకృష్ణ, తనపై ప్రజలు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు.అభిమానులు మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రౌతు రామకృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం శ్రమిస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆనం నవీన్, యర్రమతి నవీన్, నాగూర్ మీరా, సతీష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన యువత, అభిమానులు రౌతు రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ప్రజాసేవా ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## లండన్ ఐ' తరహా రాజధానిలో 'అమరావతి ఐ'

స్వర్ణసాగరం అమరావతి

లండన్‌లోని ప్రసిద్ధ 'లండన్ ఐ' రాజధాని తరహాలో అమరావతిలో కృష్ణా నది తీరాన 'అమరావతి ఐ' పేరిట భారీ స్థాయిలో జియాంట్ అబ్జర్వేషన్ వీల్‌ను నిర్మించేందుకు సీఆర్‌డీఏ చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. రాష్ట్ర సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రి వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. 'అమరావతి ఐ" అనేది ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించబోతున్న ఒక పెద్ద ప్రాజెక్టు. అక్కడ నిర్మించనున్న భారీ చక్రం పైకి వెళ్లినప్పుడు పర్యాటకులు అందులో కూర్చుని అమరావతి నగరాన్ని, నది అందాలను చుట్టూ ఉన్న పరిసరాలను చాలా ఎత్తు నుండి స్పష్టంగా చూడవచ్చు. ఇది మన రాజధానిలో పర్యాటకాన్ని పెంచడానికి, పర్యాటకులను ఆకర్షించడానికి ఒక ప్రత్యేకమైన ల్యాండ్‌మార్క్‌గా నిలవనుంది. రూ. 547 కోట్లతో రాజధాని అమరావతి నగరంలో అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలో సూపర్ బ్లాక్ 'ఊ'లో హైకోర్టు భవనంలో రూఫ్ టాప్ ఎలివేషన్లలో ప్రీకాస్ట్ ఫిన్స్, పార్కింగ్, సెక్యూరిటీ పెవిలియన్లు, వాటర్ బాడీలు, అంతర్గత రోడ్లు, సబ్‌స్టేషన్, జడ్జెస్ డ్రాప్--ఆఫ్ -- ఇతర పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాజధాని అమరావతి నగరంలో రాయపూడి గ్రామంలో నిర్మిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ, సెక్రెటరీ స్థాయి అధికారుల భవనాలకు హోమ్ ఆటోమేషన్ సిస్టమ్స్, అదనపు వార్డ్రోబ్లు, స్టోర్ రూమ్, జ్యూస్ కౌంటర్, స్పైరల్ స్టెయిర్‌కేస్, బాల్కనీ విత్ క్యానోపీ, కార్ పార్కింగ్ షెడ్, గ్లేజ్డ్ రెయిలింగ్స్, టెన్సైల్ రూఫింగ్, హీట్ పంప్స్ తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు మరో రూ. 94 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. విశాఖపట్నం రూరల్ మండలం మాధురవాడ గ్రామంలో 9.39 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విజయవాడకు స్టార్ హోటల్, రిసార్ట్‌ట్ల లేదా ఇతర పర్యాటక ప్రాజెక్టుల అభివద్ధి కోసం బదిలీ చేయడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.

## వాకాడులో నేడు "కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమం

స్వర్ణసాగరం, వాకాడు, జూన్ 5:

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో "కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో నేడు వాకాడులో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.స్థానిక అశోక్ పిల్లర్ సెంటర్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజా సమస్యలపై నిరసన వ్యక్తం చేయనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త మేరిగా మురళీధర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. రాజకీయ, ప్రజా సమస్యలపై పార్టీ చేపడుతున్న ఉద్యమాల్లో భాగంగా ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# వైభవంగా సంకటహర గణపతి వ్రతం





**కాణిపాకం , స్వర్ణ సాగరం జూన్ 4**

కాణిపాకం వైభవంగా సంకటహర గణపతి వ్రతం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ఆస్థాన మండపం నందు బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా వైభవంగా శ్రీ స్వామివారి సంకటహర గణపతి వ్రతం ఉదయం మరియు సాయంత్రం 4 బ్యాచుల్లో ఈ వ్రతంని నిర్వహించడం, స్వామి వారి ఆలయ మాడవీధులలో వైభవంగా స్వర్ణ బంగారు రథంపై ఊరేగింపు నిర్వహించడం జరిగింది జరిగింది, ఈ కార్యక్రమంలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ , మండలం అధ్యక్షుడు హరిబాబు నాయుడు, జడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, కాణిపాకం దేవస్థానం బోర్డు డైరెక్టర్ వసంతమ్మ, దేవస్థానం డీఈఓ సాగర్ బాబు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాలాజీ నాయుడు, రవి, అర్చకులు, వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.

# భావితరాల కోసం 'పచ్చని' అడుగులు.. పర్యావరణ వారధి సుధీర్ కుమార్

**స్వర్ణ సాగరం, కోవూరు, జూన్ 4:**

ఆయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడే.. కానీ ఆయన ఆలోచన మాత్రం సమాజ హితం. తరగతి గది నాలుగు గోడలకే తన బోధనను పరిమితం చేయకుండా, 'ప్రకృతి పరిరక్షణ'ను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నారు బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సామాజికవేత్త గండికోట సుధీర్ కుమార్. భూతాపం (గ్లోబల్ వార్మింగ్) విలయానికి ప్రకృతి సమతుల్యత దెబ్బతింటున్న వేళ.. విద్యార్థులు, సమాజంలో కాలుష్య నియంత్రణపై అలుపెరగని అవగాహన కల్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**హరిత విప్లవం.. వేలాది మొక్కల నాటడం...**భూమిని పచ్చదనంతో నింపడమే ధ్యేయంగా సుధీర్ కుమార్ తన విద్యార్థి సైన్యంతో కలిసి వేలాది మొక్కలను నాటించారు. కేవలం మొక్కలు నాటడమే కాదు, వాటి సంరక్షణ బాధ్యతలను కూడా విద్యార్థులకు అప్పగించి వారిలో పర్యావరణ బాధ్యతను చిన్ననాడే నూరిపోస్తున్నారు.

**భూగర్భ జలాల పెంపునకు 'ఇంకుడు గుంతలు'..**నీటి చుక్కే జీవనపునాది అని నమ్మిన ఆయన.. పాఠశాల ఆవరణలోనే కాకుండా స్థానికంగా ఇంకుడు గుంతలు తవ్వించారు. భూగర్భ జలమట్టం పెరిగితే కలిగే లాభాల గురించి విద్యార్థులకు, గ్రామస్థులకు ప్రాక్టికల్‌గా వివరిస్తూ జల సంరక్షణపై చైతన్యపరుస్తున్నారు.




**పోటీల ద్వారా ప్రతిభాపాటవాలు.. ప్లాస్టిక్ రహిత సంకల్పం..**జీవవైవిధ్యం (బయోడైవర్సిటీ) ప్రాధాన్యతను పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చేయడానికి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తుంటారు. గెలుపొందిన విద్యార్థులకు స్వయంగా బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు. అలాగే పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను విడనాడాలని పిలుపునిస్తూ.. ప్రతి విద్యార్థికి గుడ్డ సంచులను పంపిణీ చేసి, పర్యావరణహిత జీవనశైలి వైపు అడుగులు వేయిస్తున్నారు.

**జాతీయ స్థాయిలో 'బుచ్చిరెడ్డిపాలెం' ఖ్యాతి**

ఆయన చేస్తున్న పర్యావరణ సేవలు కేవలం స్థానికేతర ప్రాంతాలకే పరిమితం కాలేదు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్కతాలోని ప్రతిష్టాత్మక 'సైన్స్ సిటీ'లో నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో సుధీర్ కుమార్ పాల్గొన్నారు. అక్కడ నీటి సంరక్షణపై ఆయన ఇచ్చిన పది నిమిషాల ప్రసంగం, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ దేశవ్యాప్తంగా వచ్చిన పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకోవడం విశేషం...

**యువతకు స్ఫూర్తి:** "నాటిన ప్రతి మొక్కా, పొదుపు చేసిన ప్రతి నీటి చుక్కా మన భావితరాలకు మనం ఇచ్చే ఆస్తి" అనే నినాదంతో ముందుకు సాగుతున్న గండికోట సుధీర్ కుమార్ లాంటి ఉపాధ్యాయులు సమాజానికి ఎంతో అవసరం. ఉపాధ్యాయుడిగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే.. ప్రవృత్తిగా పర్యావరణ పరిరక్షణను ఎంచుకున్న సుధీర్ కుమార్ పయనం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.

# 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' అంటూ వైఎస్సార్సీపీ నిరసన






**ముత్తుకూరు..స్వర్ణ సాగరం**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం రెండేళ్లు గడిచినా అమలు చేయకుండా మోసం చేసిందని వైఎస్సార్సీపీ నాయకులు విమర్శించారు. మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు ముత్తుకూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ అంటే గ్యారెంటీగా మోసమేనని మరోసారి నిరూపితమైంది అని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పేరుతో మహిళలు, యువత, రైతులు, బీసీలు సహా అన్ని వర్గాల ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి కింద రూ.3,000, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ వంటి కీలక హామీలను అమలు చేయలేదన్నారు. రెండేళ్ల పాలనలో ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదని, ఒక్క కొత్త ఇంటి స్థలం ఇవ్వలేదని, కొత్త ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేశారని పేర్కొన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని కుదిస్తూ, అభివృద్ధిని పక్కనపెట్టి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు.విద్యారంగాన్ని కూడా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. తల్లికి వందనం పథకంలో కోతలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, అటకెక్కిన నాడు--నేడు పనులతో విద్యావ్యవస్థను దెబ్బతీశారని అన్నారు. రైతులను పూర్తిగా నట్టేట ముంచారని చెప్పారు. ఎన్నికల ముందు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎక్కువ పథకాలు అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నింటికీ మంగళం పాడారని విమర్శించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని "డౌన్ డౌన్ చంద్రబాబు" అంటూ నినాదాలు చేశారు. సూపర్ సిక్స్ హామీలు, ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జడ్పిటిసి వెంకటసుబ్బయ్య,మాజీ జెడ్పిటిసి నెల్లూరు శివప్రసాద్, ఎంపిటీసీలు నవీద్ భాషా, వై.వెంకటేశ్వర్లు, నాయకులు ఆలపాక శ్రీనివాసులు, పాముల శ్రీనివాసులు, చెంగారెడ్డి, రాగాల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు

# హుజూర్‌నగర్‌లో నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన

**స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా జూన్/ 04**

హుజూర్‌నగర్ పట్టణంలో ప్రతిపాదిత నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి సంబంధించి స్థల పరిశీలన నిర్వహించారు.సుమారు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక బస్టాండ్ నిర్మాణానికి అనుమతులు లభించిన నేపథ్యంలో,తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్థలాన్ని



పరిశీలించారు.ఈ సందర్భంగా హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి బస్టాండ్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించి, నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.బస్టాండ్ అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి,3వ వార్డు కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్,14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు,ఆర్టీసీ మేనేజర్ శ్రీనివాస్,అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, కంట్రోలర్‌తో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ పై చవకబారు వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా నష్టపోతారు

### ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి ఏపీ శివయ్య



**ఐరాల, స్వర్ణ సాగరం జూన్ 4**

ఐరాల మండలం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మరియు ఇతర రాజకీయ పార్టీల నాయకులు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గురించి అవాకులు చవాకులు మాట్లాడుతూ చవకబారు ఆరోపణలు చేయడం తగదని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి ఏపీ శివయ్య తీవ్రంగా హెచ్చరించారు.పవన్ కళ్యాణ్ కి తెలంగాణ ప్రజలపై ఎంత గౌరవం, ప్రేమ, అభిమానం ఉందో దేశ ప్రజలందరికీ తెలుసని ఆయన పేర్కొన్నారు. అలాంటి ప్రజానాయకుడిపై నిరాధార ఆరోపణలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు.పవన్ కళ్యాణ్ ని మరియు జనసేన పార్టీని ఎదుర్కొనే ధైర్యం, దమ్ము కాంగ్రెస్ నాయకులకు లేదని ఏపీ శివయ్య వ్యాఖ్యానించారు.తెలుగు రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయకూడదని, రెండు రాష్ట్రాల ప్రజలు సోదరభావంతో అభివృద్ధి చెందాలని కోరుకునే నాయకుడు పవన్ కళ్యాణ్ ని తెలిపారు. అలాంటి నాయకుడిని విమర్శించడం కాంగ్రెస్ నాయకుల రాజకీయ సమాధికి దారితీస్తుందని హెచ్చరించారు.రాబోయే తెలంగాణ ఎన్నికల్లో జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తూ తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తుందని ఏపీ శివయ్య స్పష్టం చేశారు.

# షుగర్ పేషెంట్లకు ప్రత్యేకమైన వైద్యం

### వైద్యాధికారి జి.ఎస్. లక్ష్మీ నరసమ్మ



**ఐరాల స్వర్ణ సాగరం జూన్ 4**

ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇరు రువారం పల్లె వద్దా ఎఫ్ డి పి కార్యక్ర మంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ జి ఎస్ లక్ష్మీనరసమ్మ బీపీ షుగర్ పేషంట్లని పరీక్షించి మం దులు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా పరిసర గ్రామ ప్రజలు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించు కున్నారు బీపీ షుగర్ పేషెంట్లు తప్పనిసరిగా నెల నెల పరీక్షలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు అదేవిధంగా గర్భవతులు చిన్నపిల్లలు ఓ పి వచ్చి ఎఫ్డిపి సదుపాయాన్ని వినియోగించుకున్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ వేసవికాలం వడదెబ్బ గురించి అవగాహన అందించారు అదేవిధంగా ఎన్సిడి సర్వే డి ఐ ఎన్ సి సర్వే ను ప్రజలలో అవగాహన కల్పించి ఎందుకు చేసుకోవాలి,దాని వలన లాభాలు ఏంటి అని ప్రజలకు తెలిపిన తర్వాత వారి యొక్క సహాయ సహకారాలతో సర్వేలను కంప్లీట్ చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి జి అర్చన, ఏఎన్ఎం సి ప్రశాంతి,డి ఏ జి మనోజ్ కుమార్ మరియు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ట్రాక్ పునరుద్ధరణ...ట్రాఫిక్ మళ్లింపు

### రైల్వే స్టేషన్ సెక్షన్ ఇంజనీర్ మధుసూదన్

**స్వర్ణసాగరం పూతలపట్టు 04**

పూతలపట్టు రైల్వే స్టేషన్ల మధ్య కిమీ 60/9-11 వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ నెం. 02 వద్ద ట్రాక్ పునరుద్ధరణ పనుల నిమిత్తం ట్రాఫిక్ మళ్లింపు చిత్తూరు రైల్వే స్టేషన్ సెక్షన్ ఇంజనీర్ మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు.

పాకాల -- పూతలపట్టు రైల్వే స్టేషన్ల మధ్య కిమీ 60/9-11 వద్ద గల రైల్వే లెవల్ క్రాసింగ్ నెం. 02 వద్ద రైల్వే పట్టాలు, స్లీపర్లు మరియు ఇతర ఫిట్టింగ్స్ పునరుద్ధరణ (ꦿతీꦲꦺఎꦿ =వꦲవꦲꦲశ్రీ) పనులు చేపట్టబడనున్నాయి.

ప్రజల భద్రత దృష్ట్యా రైల్వే పరిపాలన ఈ పనులను నిర్వహించాలని నిర్ణయించినందున, సంబంధిత లెవల్ క్రాసింగ్ వద్ద రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించాల్సిన అవసరం ఏర్పడింది.

అందువల్ల, 06.06.2026 నుండి 18.06.2026 వరకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయుచున్నామని చిత్తూరు రైల్వే సెక్షన్ ఇంజనీర్ మధుసూదన్ తెలిపారు.

# సాయినాథునికి ప్రత్యేక పూజలు

### ఉభయకర్తలుగా నన్నూరు వెంకటయ్య, బుజ్జమ్మ దంపతులు



**స్వర్ణ సాగరం ఓజిలి జూన్ 04:**

మానమాల సాయిబాబా మందిరంలో మందిర నిర్మాణ కర్తలు ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం కాగడాహారతి సాయినా థుని మేల్కొల్పి కాగడాహారతితో పూజలను ప్రారంభించారు. ఆలయ శాశ్వితనిర్మాణ కర్తలు కట్టా విష్ణువర్ధన్ రెడ్డి, సాయి సుజన రెడ్డి గోత్ర నామాలపై పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సాయిబాబాకు అభిషేకాలు, హారతులు పట్టి వినాయకస్వామి, దత్తాత్రేయ స్వామి, శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయినాథుని పుష్పాలతో అ లంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మానమాల గ్రామానికి చెందిన నన్నూరు వెంకటయ్య, బుజ్జమ్మ దంపతులు ఉభయకర్తలగా వ్యవహరించి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. సాయంత్రం దూఫ్ హరతితో సాయినాథుని కి పూజలు చేశారు. రాత్రి పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సేజ్ హారతి నిర్వహించి భక్తులకు సాయిబాబా దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

swarna sagaram_Swarna sagaram.qxd 6/5/2026 3:36 AM Page 2



# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం

### పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**స్వర్ణ సాగరం ఓజిలి జూన్ 04 :**

రాష్ట్రంలో అధికారం చేపట్టిన చంద్రబాబు సర్కార్ రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచి రెండు సంవత్సరాలు గడవడంతో ఓజిలి బస్టాండ్ కార్యక్రమంలో చంద్రబాబు వెన్నుపోటు రెండేళ్లు నిరసన కార్యక్రమం ను మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరై నిరసన కార్యక్రమాలు పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన తర్వాత రెండు సంవత్సరాలు పరిపాలనలో సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన ప్రతులను ప్రజలకు చూపించి నిరసన తెలియజేశారు. ఎన్నికల హామీలను కూటమి సర్కార్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల ప్రతులను తగలబెట్టారు. ఈ పాల్గొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కొండూరు వెంకటసుబ్బరాజు, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడు, వైఎస్ఆర్సిపి మండల ఉపాధ్యక్షుడు బెల్లం సుబ్బానాయుడు, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్బాషా, మాజీ సర్పంచులు ఎల్లా సురేష్ రెడ్డి, ఏకశిరి గోపాలయ్య, ఆరణి దిలీప్ కుమార్ రెడ్డి, కొండూరు ప్రభాకర్ రాజు, నాయకులు కొండూరు దామోదర్ రాజు, బట్టి కాయల కృష్ణయ్య, పిండుకూర్ మధుసూదన్ రెడ్డి, పరంగి ప్రసాద్, రామాబత్తిన సురేష్, శ్రీనివాసులు శెట్టి, జడపల్లి నాగరాజు, మురళి, దాసరి సాయి, మహేష్, పున్నేపల్లి ప్రసాద్, గుంటు మడుగు సుకుమార్రాజు, ముప్పాళ్ళ మోహన్రాజు, అజ్మతుల్లా, గెడి శ్రీధర్ రెడ్డి, రామచంద్ర రాజు, జగ్గయ్య, పాదర్తి రాములనాయుడు, రామ్మూర్తి రాజు, గోపాలయ్య, నిమ్మతి వెంకటేశ్వర్లు, కొలనుకుదురు సురేష్ రెడ్డి, విక్కీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ లో సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



**స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా జూన్/ 04**

అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న తిలక్ నగర్ 14వ వార్డుకు చెందిన వడ్లానపు అంజమ్మ (భర్త కొండలు) కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుండి రూ. 60,000 మంజూరయ్యాయి.ఈ నిధికి సంబంధించిన చెక్కును హుజూర్‌నగర్ లోని రాష్ట్ర ఇరిగేషన్,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ ఆదేశాల మేరకు 14వ వార్డు ఇంచార్జ్,కాంటెస్ట్ కౌన్సిలర్ కోలపూడి జ్యోతి యోహాన్ ఈ చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కోలపూడి యోహాన్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సీఎం సహాయ నిధి చెక్కులు గతంలో కంటే ఎక్కువ మొత్తంలో,వేగంగా మంజూరవుతున్నాయని తెలిపారు.హుజూర్‌నగర్ పట్టణంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం,రేషన్ కార్డులు,ఉచిత విద్యుత్,ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు.నియోజకవర్గంలోని అన్ని మండలాలు,గ్రామాలు,పట్టణాల్లో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు.ఈ కార్యక్రమాల్లో పెద్దారపు రామకృష్ణ, దుగ్గి సైదులు,కోళ్లపూడి కాంతయ్య, లచ్చుమల్ల సైదులు,ముప్వ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ' ఖేత్ బచావో అభియాన్' అవగాహన సదస్సు





**మనుబోలు, స్వర్ణ సాగరం:**

మనుబోలు మండలంలోని పిడూరు గ్రామంలో ' ఖేత్ బచావో అభియాన్' (నేల తల్లిని కాపాడుకుందాం) కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి. వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ, నేల ఆరోగ్యానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే రసాయన ఎరువులను వాడాలని ఆయన సూచించారు. ఇలా చేయడం వల్ల అనవసరమైన ఎరువుల వాడకం తగ్గి, భూసారం పెరగడమే కాకుండా వాయు, జల కాలుష్యాలను నివారించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.అంతేకాకుండా, పంటలకు నానో యూరియా, నానో డి.ఏ.పి లను సరైన సమయంలో పిచికారి చేయడం ద్వారా ఆరోగ్యకరమైన దిగుబడిని సాధించవచ్చని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఎస్ కె . ఇర్షాద్, తిక్కవరపు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

### – ఎన్నికల హామీలకు తిలోదకాలు!"
### – నిరసన ర్యాలీ నిర్వహించిన వైసీపీ నాయకులు

**మనుబోలు, స్వర్ణ సాగరం:**

గత రెండేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. చంద్రబాబు వెన్నుపోటు కు రెండేళ్లు పూర్తయినాయి .అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపణలు వస్తున్నాయి అని మనుబోలు మండల వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వాని గట్టిగా హెచ్చరించారు. మనుబోలు మండల కేంద్రంలో వైసీపీ పార్టీ మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు నెల్లూరు జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పిలుపు తో మండల కన్వీనర్ బొమ్మి రెడ్డి హరగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బైపాస్ కూడలి వద్ద ఉన్న వై యస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసన కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోని, బాండ్లను చింపివేసి దగ్ధం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మనుబోలు వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ నాయకులు మాట్లాడుతూ కేవలం అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తూ,వారిని నిలువునా ముంచుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండేళ్ల పాలనలో ఎటువంటి సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా, అసలు ఒక్క పెన్షన్ గానీ, అర్హులైన వారికి ఒక్క సంక్షేమ పథకం గానీ అందించలేదని, గృహ నిర్మాణానికి సంబంధించి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని మండిపడ్డారు. ప్రజా తీర్పును, ప్రజాస్వామ్య విలువలను అవమానపరిచిన వెన్నుపోటు రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, నిజాలను ప్రజలకు తెలియజేయడానికి నిరసన కార్యక్రమం చేస్తున్నామన్నారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చని ప్రభుత్వం, రాష్ట్రాన్ని దోచుకోవడంలోనే నిమగ్నమైందని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ప్రజల మద్దతును పొందేందుకు అబద్ధపు హామీలను నమ్ముకున్నారని, కానీ ప్రజలందరికీ ఈ ప్రభుత్వ వైఫల్యాలు అర్థమైపోయాయని, రాబోయే రోజుల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు మనుబోలు టౌన్ అధ్యక్షుడు ముంగర రవీందర్ రెడ్డి, కడివేటి చంద్రశేఖర్ రెడ్డి, మన్నె మాల సాయి మోహన్ రెడ్డి,దాసరి భాస్కర్ గౌడ్ సూరపనేని కిషోర్ నాయుడు,గుండాల ఆదినారాయణ, కుడుముల వెంకటరమణయ్య గౌడ్ కోసూరు కోటేశ్వరరావు గౌడ్ దువ్వూరు సుధాకర్ రెడ్డి ఎంపీపీ గుండాల వజ్రమ్మ,ముంగర వెంకట రమణారెడ్డి ఉచ్చూరు కమలాకర్ రెడ్డి ప్రదీప్ రెడ్డి తులసీరామ్ యాదవ్, ఆవుల జగదీష్ యాదవ్,గిద్దండి రమణయ్య, మడమనూరు ప్రదీప్ రెడ్డి,తుపాకుల గిరి, మాజీ సర్పంచ్ శశి కుమార్ రెడ్డి ఎంపీటీసీ గుమ్మడి వెంకటసుబ్బయ్య యాదవ్,గుంజి రమేష్ అంబటి శ్రీనివాసులు రెడ్డి, సన్నారెడ్డి జానకిరామిరెడ్డి, చల్ల నవకోటి, దయాకర్,యనమల అంకయ్య, బళ్ళ శేఖర్ కనిమెల మల్లికార్జున్ పరిమళ శివరాం,గురివిందపూడి మస్తాన్,గ్రామ పార్టీ వివిధ కమిటీ నాయకులు, మహిళలు,మండల అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## రేణిగుంటలో కదం తొక్కిన వైకాపా శ్రేణులు



**రేణిగుంట స్వర్ణ సాగరం జూన్ 04**

గడచిన రెండేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రజలను వెన్నుపోటు పొడిచిన వైనంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం లో భాగంగా శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం ముందు వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు గంగారి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు నిరసన తెలిపి వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్లను దహనం చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మండల కో ఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్, నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి, గణేష్ రెడ్డి, గంగయ్య,నగేషం, మునిశేఖర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, నాగరాజు, లక్ష్మీపతి రెడ్డి, శంకర్ రెడ్డి, శేఖర్, ఇర్ఫాన్, రఫీ ఉల్లా, షబీర్ అహ్మద్, ఇరానీ ఖాదర్, జాన్ బాబు, ఆనంద్ బాబు, శశి కిరణ్, ఫర్విన్, జ్యోతి, లత, సరోజమ్మ, మోహన్, శివయ్య, నాటా సుబ్రమణ్యం, శివకుమార్, పార్థసారథి, ప్రకాష్, లోకానధరెడ్డి, నల్ల పాలెం శ్రీనివాసులు రెడ్డి,మధు, కిషోర్, గుణశేఖర్, మునిశేఖర్, ధనంజేయాలు, రహంతుల్లా, భాస్కర్, వెంకటయ్య, వాసు, సురేంద్ర, రాజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాశిరెడ్డి కాలనీలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 04**



కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న వేము రామాంజనేయులు వయసు 29 సంవత్సరాలు గురువారం తన ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నారు.అతను తన భార్యతో గత కొంతకాలం నుండి మనస్పర్థలు ఉండి విడివిడిగా ఉంటున్నట్లు ఈ కారణం చేత సదరు వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకొని మరణించినట్లు మృతుని బాబాయి అయిన వేము రామారావు గారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కనిగిరి పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య ఒక కుమారుడు సంతానం కలరు.

## తప్పిపోయిన వృద్ధుడి ఆచూకీ కోసం పోలీసుల ప్రకటన




**రేణిగుంట స్వర్ణ సాగరం జూన్ 03**

తిరుపతికి చెందిన 81 ఏళ్ల వృద్ధుడు ఆర్. నారాయణ కురుప్ (నాను) గత నెల 13వ తేదీ మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మతిమరుపు (డిమెన్షియా) వ్యాధితో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, నారాయణ కురుప్ చివరిసారిగా చెన్నై సమీపంలోని ఈరోడ్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో కనిపించినట్లు సమాచారం. అనంతరం ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీఆర్పీ/ఈరోడ్ కేసు నం. 76/2026గా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తప్పిపోయిన సమయంలో ఆయన డార్క్ గ్రే రంగు టీ-షర్ట్, నేవీ బ్లూ హాఫ్ స్లీవ్ స్వెటర్, లైట్ బ్లూ రంగు లుంగీ ధరించి ఉన్నారు. మలయాళం, తమిళం, ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ భాషలు మాట్లాడగలరని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఎత్తు సుమారు 165 సెం.మీ. ఉండగా, సన్నగా, బలహీనంగా కనిపిస్తారని పేర్కొన్నారు. ఎవరికైనా ఆయన ఆచూకీ తెలిసినట్లయితే వెంటనే జీఆర్పీ ఈరోడ్ లేదా 9943839758 నంబర్‌కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## శ్రీ షిరిడి సాయిబాబా కు ప్రత్యేక పూజలు

**మనుబోలు,స్వర్ణ సాగరం :**



మనుబోలు గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద సమర్పణ కార్యక్రమం. అర్చకులు శశి కుమార్ శర్మ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలకు ఉభయ దాతలుగా వీరంపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు చిగిలి శ్రీనివాసుల రెడ్డి జ్ఞాపకార్థంఆయన కుమారుడు చిగిలి శ్రీకాంత్ రెడ్డి, సాయి నీలిమ దంపతులు మరియు వీరి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ప్రజల ముంగిటకే రెవెన్యూ యంత్రాంగం

### 'వన్ మంత్ – వన్ విలేజ్ – ఫోర్ విజిట్స్' ప్రారంభం
### – తహశీల్దారు ఈ. రమాదేవి

**మనుబోలు, స్వర్ణ సాగరం:**

ప్రజల రెవెన్యూ,ఇతర సమస్యలను క్షేత్రస్థాయిలో వేగంగా పరిష్కరించేందుకు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాల మేరకు, మనుబోలు మండలంలో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'వన్ మంత్ – వన్ విలేజ్ – ఫోర్ విజిట్స్' (ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు) పేరుతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మనుబోలు తహశీల్దారు ఈ. రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని, అక్కడ నాలుగు పర్యాయాలు పర్యటించడం



ద్వారా గ్రామాల్లోని సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం ఈ కార్యక్రమ ఉద్దేశమని తహశీల్దారు పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని నేరుగా ప్రజల ముంగిటకే తీసుకెళ్తామని ఆమె వివరించారు.

ఈ కార్యక్రమ షెడ్యూల్‌లో భాగంగా, మనుబోలు మండలంలో మొదటిగా 'మాడమనురు' గ్రామాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. జూన్ నెలలో ఈ గ్రామంలో నాలుగు విడతలుగా 'గ్రామ సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నారు.జూన్ 05, 12, 19,26,...2026 పైన పేర్కొన్న తేదీలలో ఉదయం 10:30 గంటలకు మాడమనురులో నిర్వహించే పరిష్కార వేదికకు మండల స్థాయి అధికారులు హాజరవుతారు. భూ సమస్యలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నవారు, దరఖాస్తులను సమర్పించి ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు ప్రజలను కోరారు.

swarna sagaram_Swarna sagaram.qxd 6/5/2026 3:36 AM Page 3



# సూపర్ సిక్స్ అట్టర్ ఫెయిల్యూర్







## వెన్నుపోటుకు రెండేళ్లు వైకాపా నిరసనలో నేతలు

### సూపర్ సిక్స్ పోస్టర్లు దగ్ధం

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 4**

సూపర్ సిక్స్ అట్టర్ ఫెయిల్యూర్ అని వైకాపా నేతలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం వైకాపా మండల అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాజీ మంత్రి కాకాణిగోవర్ధన రెడ్డి ఆదేశాలతోవెన్నుపోటుకు రెండేళ్లనిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైకాపా సీనియర్ రాష్ట్ర నేత చిల్లకూరు సుధీర్ రెడ్డిమండలవైఎస్ఆర్సిపి అధ్యక్షులు శంకరయ్య గౌడ్ మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ మన్యం సుబ్రహ్మణ్యం గౌడ్సీనియర్ నాయకులుతలమంచి సురేంద్రబాబుకూటమి ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు.ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచన చేశారని పేర్కొన్నారు.అమ్మ ఒడి పింఛన్ఇతర పథకాలు పూర్తిగాఅమలు చేయడంలో విఫలమైనట్లు పేర్కొన్నారు.వైకాపా పాలనలోమాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో చెప్పిన వాగ్దానాలు అమలుపరిచి తనకంటూ ప్రత్యేక గుర్తింపు వైకాపాకు ఉజ్వల భవిష్యత్తు ఉన్నట్లు నేతలు తెలిపారుఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ నిరసనలోజడ్పిటిసి శేషమ్మమన్యం చిరంజీవి గౌడ్ఇసనాక రమేష్ కావల్ రెడ్డి రంగారెడ్డి టంగుటూరు పద్మనాభరెడ్డి ఆకుల మధుసూదన్ గౌడ్ మహిళా నేత ఎంబేటి సంధ్యారాణివేములశ్రీనివాసులుకుల్లూరు శేషు తిరుపతయ్యఅధిక సంఖ్యలో సంఖ్యలోవైఎస్ఆర్సిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# చంద్రబాబు ష్యూరిటీ సూపర్ సిక్స్ పథకాలు మోసం గ్యారెంటీ' అంటూ వైఎస్సార్సీపీ నిరసన

**బంగారుపాళ్యం.స్వర్ణ సాగరం. జూన్ 4**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం రెండేళ్లు గడిచినా అమలు చేయకుండా మోసం చేసిందని వైఎస్సార్సీపీ నాయకులు విమర్శించారు బంగారుపాళ్యం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో పూతలపట్టు మాజీ ఎమ్మెల్యేలు సునిల్ కుమార్, పలమనేరు మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, రాష్ట్ర పాలఎకిరి సంఘం అధ్యక్షులు ఎం బి కుమార్ రాజా మండల కన్వీనర్ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ అంటే గ్యారెంటీగా మోసమేనని మరోసారి నిరూపితమైంది అని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పేరుతో మహిళలు, యువత, రైతులు, బీసీలు సహా అన్ని వర్గాల ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి కింద రూ.3,000, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ వంటి కీలక హామీలను విద్యార్థుల కు కాలర్షిప్ లు అమలు చేయకండ సూపర్ సిక్స్ పథకాలు అములు చేశామని అనవసరంగా ప్రెస్ మిట్లు పెట్టి రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని రెండేళ్ల పాలనలో ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదని, ఒక్క కొత్త ఇంటి స్థలం ఇవ్వలేదని, కొత్త ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్క టిగా నిలిపివేశారని పేర్కొన్నారు. ప్రజలకు అందు తున్న సంక్షేమాన్ని కుదిస్తూ, అభివృద్ధిని పక్కనపెట్టి ప్రభు త్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శిం చారు.విద్యారంగాన్ని కూడా నిర్వీర్యం చేశారని ఆరోపిం చారు. తల్లికి వందనం పథకంలో కోతలు, ఫీజు రీయిం బర్స్మెంట్ బకాయిలు, అటకెక్కిన నాడు--నేడు పనులతో విద్యావ్యవస్థను దెబ్బతీశారని అన్నారు. రైతులను పూర్తిగా నట్టేట ముంచారని చెప్పారు. ఎన్నికల ముందు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎక్కువ పథకాలు అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నింటికీ మంగళం పాడారని విమర్శించారు. అనంతరం కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా కరెంట్ ఛార్జీలు,గ్యాస్, పెట్రోలు,వంట సరుకులు ధరలు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరిచిందని అనంతరం సూపర్ సిక్స్ హామీలు, ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను చింపి నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి,దత్తత్రేయ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,ప్రకాష్ రెడ్డి, గోవిందస్వామి,థామస్,కిషోర్ కుమార్ రెడ్డి,గజేంద్ర,త్యాగ,శేఖర్ రెడ్డి,మునీంద్ర, సుబ్రహ్మణ్యం, హేమచంద్ర,మహేంద్ర, జగదీష్,ఎస్ కె షాకీర్,రఘు, అశోక్,ఖాదర్ బాష, కుమార స్వామి, విజయకుమార్,తగ్గువారిపల్లి జగదీశ్,



## B.L.కండ్రిగ గ్రామంలో గంగమ్మ దేవి ఆలయం కుంభభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న వైకాపా నాయకులు





**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం. జూన్ 4**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని బి ఎల్ కండిగా గ్రామం లో గురువారం నూతనం గా నిర్మించిన గంగమ్మ ఆలయ గోపుర కలశ మహా కుంభాభిషేకం లో పాల్గొన్న వైఎస్సార్ పార్టీ పూతలపట్టు నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ మరియు చిత్తూరు నియోజకవర్గం సమన్వయకర్త విజయానంద రెడ్డి,మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి,ప్రభా గ్రాండ్ హోటల్ యజమాని ప్రభాకర్ రెడ్డి,

రాష్ట్ర పాల ఏకరి విభాగం అధ్యక్షులు ఎం బి కుమార్ రాజా, వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి,థామస్, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందస్వామి, జిల్లా ట్రేడ్ యునియన్ కార్యదర్శి రఘుపతి రాజు, జిల్లా మాజీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు మహేంద్ర, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజా, మండల యువత అధ్యక్షుడు గజేంద్ర, మాజీ యువత అధ్యక్షుడు జగదీష్,కుమారస్వామి వీరికి బంగారుపాళ్యం మండల వైఎస్సార్ పార్టీ ప్రచార విభాగం అధ్యక్షులు పాల్ రాజ్ స్థానిక నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి సన్మానించారు

## ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో మొక్కలు నాటిన గుడ్ హెల్ప్ ఫౌండేషన్

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి



**కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 04**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు గురువారం గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్" పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ "ఏక్ పేడ్ మా కే నామ్" (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమాన్ని 2024 జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ తల్లితో కలిసి లేదా తమ తల్లి జ్ఞాపకార్థం వారి పేరు మీద కనీసం ఒక మొక్కను నాటి, ప్రకృతి పట్ల తమ కృతజ్ఞతను చాటుకోవాలని ఈ ఉద్యమం పిలుపునిస్తోందని పేర్కొన్నారు.ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా బాధ్యత తీసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాల్సిన ఉద్యమమని అన్నారు. చెట్లు ప్రాణవాయువును అందిస్తూ భూమిని, పర్యావరణాన్ని సంరక్షిస్తాయని, ప్రకృతిని కూడా మాతృమూర్తిగా భావించి మొక్కలు నాటడాన్ని ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తోందని తెలిపారు.గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు మాట్లాడుతూ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నియమాలు--2026ను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, చెత్తను తడి--పొడి వ్యర్థాలుగా వేరు చేసి సరైన విధంగా నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు.

## పోషక, ఫోర్టిఫైడ్ ఆహారాలపై ప్రత్యేక శిక్షణ

**పెళ్లకూరు స్వర్ణసాగరం జూన్ 4.**

పెళ్లకూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కుక్-కమ్-హెల్పర్లకు పోషకాహారం, ఫోర్టిఫైడ్ ఆహారాల ప్రాముఖ్యత, పరిశుభ్రత మరియు సురక్షిత వంట విధానాలపై గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈకార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు కస్తూరయ్య, శంకరయ్య ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధిలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ -- టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో



నిర్వహించిన ఈశిక్షణలో ప్రోగ్రామ్ ఆఫీసర్ అరుణ కుమారి పాల్గొని ఆహార సమూహాలు, సమతుల్య ఆహారం, ఫోర్టిఫైడ్ బియ్యం, ఇతర ఫోర్టిఫైడ్ ఆహారాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, సరైన వంట విధానాలు మరియు ఆహార పరిశుభ్రత ప్రమాణాలపై సమగ్ర అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా వంటల పోటీ నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు కుక్-కమ్-హెల్పర్లకు ఏప్రాన్లు, గ్లోవ్స్ మరియు న్యాప్కిన్లు బహుమతులుగా అందజేశారు.అనంతరం ఎంఈఓలు మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ ఆహారాలు పిల్లల్లో రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాలను తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రతి వంట సిబ్బంది ఈ అంశాలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. చేతులు కడుక్కోవడానికి అవసరమైన ఆరు దశలను ప్రదర్శించి, వ్యక్తిగత పరిశుభ్రత మరియు ఆహార భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో సీఆర్పీలు, మధ్యాహ్న భోజన పథకం కుక్-కమ్-హెల్పర్లు మరియు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## దుగరాజపట్నం పోర్టు భూసేకరణ పై రైతులతో నేడు సమావేశం



**స్వర్ణసాగరం వాకాడు జూన్4**

దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి వాకాడు మండలంలోని పలు గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతులతో నేడు (జూన్ 5) ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని పామంజి(423.85)ఎక రాలు ,వాలమేడు(380.47)డ(287.21)ఎకరాలు,పాతేటిపాళెం (226.00) ఎకరాలు,అందలమాల (0.32) ఎకరాలు వాగర్రు,తూపిలిపాళెం (504.55) ఎకరాలు, సంబంధిత గ్రామాల్లో మొత్తం వేల ఎకరాల భూమిని దుగరాజపట్నం పోర్టు నిర్మాణం కోసం సేకరించేందుకు ప్రాథమిక ప్రకటన జారీ చేసినట్లు పేర్కొన్నారు. భూనష్టపరిహారం, భూసేకరణకు సంబంధించిన అంశాలపై రైతుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశం వాకాడు తహశీల్దార్ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 2 గంటలకు జరగను ంది. భూములు కోల్పోతున్న రైతులు తప్పనిసరిగా హాజరై తమ సందేహాలు, అభిప్రా యాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఉద్యమ చరిత్రను అవమానిస్తే సహించలేదు

### ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల రామారావు



**స్వర్ణసాగరం డోర్నకల్ జూన్ 04**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ సినీ నటుడు పవన్ కళ్యాణ్ తెలంగాణ ఉద్యమ చరిత్రను అమరవీరుల త్యాగాలను తక్కువ చేసి మాట్లాడడం సరికాదని ఉద్యమకారుల ఫోరం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల రామారావు అన్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్ తెలంగాణలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దిశాబ్దాల ఉద్యమ పోరాటాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ప్రాణ త్యాగాలు చేసి 60 సంవత్సరాలు ఆకాంక్షను నెరవేర్చుకున్నామంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి తప్ప మీ ఆంధ్ర పెత్తందారుల వద్ద ఊడిగం చేయడానికి కాదని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారం రోజులు అన్నం మానేశా అని చెప్పడం కాదు మీ ఆంధ్రాలో ఉన్న పోలవరం, అమరావతి, సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. నువ్వు బిజెపి పార్టీతో చేరి తెలంగాణలో కుట్రలు చేస్తే ప్రజలు తరిమికొడతారని హెచ్చరించారు

## పద్మభూషణ్ వెన్నెలకంటి 129జయంతి వేడుకలు



**నెల్లూరు స్వర్ణసాగరం జూన్ 4**

గిరిజనుల పాలిటి దైవంస్వాతంత్ర సమరయోధులుపద్మభూషణ్ వెన్నెల కంటి రాఘవయ్య 129జయంతి వేడుకలుఆంధ్ర రాష్ట్ర ఆదిమ జాతి సేవక్ సంఘ్ సేవక్ సంఘ్ ట్రస్ట్ బోర్డ్ బోర్డ్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారుఆ మహనీయునికి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలోమోపూరు ఆదిశేషయ్య పొట్లూరు లక్ష్మీ ప్రసాద్ భానుచందర్ పురుషోత్తం ఏడుకొండలు మాధవ్ సింగ్ నాయక్ పొట్లూరు లావణ్య రాజేశ్వరమ్మ ఏ మల్లికార్జున యానాదులు యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్కార్యదర్శి పోట్లూరిశ్రీనివాసులువేటగిరి సుధాకర్ రావు కొమరగిరి ఆదిశేషయ్య రాచగిరి శ్రీనివాసులు ఏ కుల సుధాకర్ తలపలప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



**బంగారుపాళ్యం.స్వర్ణసాగరం. జూన్ 4**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని బి.ఎల్. కండ్రిగ గ్రామంలో బుధువారం ఈతకు వెళ్లి పాల్యంతోపు చెరువులో బురదలో చిక్కుకుని ఎస్టీ కాలనీకి చెందిన చిన్నారులు సత్య (12), పవన్ కుమార్ (7) మృతి చెందిన విషాద ఘటన తీవ్ర కలకలం రేపింది.ఈ ఘోర ప్రమాదం గురించి తెలుసుకున్న పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మరియు మండల టీడీపీ అధ్యక్షులు ఎన్. పి. ధరణి నాయుడు గురువారం బాధితుల గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి చెందిన చిన్నారుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి అశ్రునయనాలతో నివాళులర్పించారు.అనంతరం చిన్నారుల కుటుంబ సభ్యులను ఓదార్చి, కష్టకాలంలో తమ కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్,రాగిమాను పెంట క్లస్టర్ ఇంచార్జ్ బాలకృష్ణ నాయుడు,నాగరాజు, సుబ్రహ్మణ్యం సుధాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వంలోనే అసలైన సంక్షేమం, అభివృద్ధి:



### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి..

**కోవూరు, స్వర్ణ సాగరం , జూన్ 4:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కొడవలూరులోని పి.ఎస్.ఆర్ కళ్యాణమండపంలో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్–బిఎల్ఏ సమావేశంలో కోవూరు ఎమెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్నందుకు గాను ఆమె కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హైబ్రిడ్ మహానాడును విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ, 'కార్యకర్తలే పార్టీకి బలమని' కొనియాడారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక సామాజిక పింఛన్‌ను రూ.4000కు పెంచడంతో పాటు, ఇంట్లో అర్హులైన పిల్లలందరికీ 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో అసలైన సంక్షేమాన్ని అందిస్తున్నారని, గత ప్రభుత్వంలో దెబ్బతిన్న రోడ్లను బాగు చేస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు పనులు చేపట్టామని వివరించారు. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని.. ప్రతి ఒక్కరూ 'మై టీడీపీ' యాప్ డౌన్లోడ్ చేసుకుని సోషల్ మీడియాలో చురుగ్గా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, సీనియర్ నాయకులు తవ్వర ప్రవీణ్ కుమార్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## "తోటపల్లి గూడూరు""పటిష్టంగా వైకాపా క్యాడర్"

### అందరిని సమన్వయం చేసుకొని ముందుకు పోతున్న " ఉప్పల"



**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 4**

తోటపల్లి గూడూరు మండలం వైయస్సార్సీపి అధ్యక్షులుగా ఉప్పల శంకరయ్య గౌడ్ తన బాధ్యత నిర్వహణలో వైకాపా క్యాడర్ ను పటిష్టంగా ముందుకు తీసుకుపోవడంలో సమర్థవంతంగా పనిచేయడాన్ని వైకాపా ఆయా గ్రామాల నేతలు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపాలనపై అత్యంత విశ్వాసం మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పట్లవిధేయతతో పాటుమండల ముఖ్య వైకాపా నేతలను కార్యకర్తలనుసమన్వయము చేసుకుంటూ ముందుకు పోతున్నారుమాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతులు వర్ధన్తు లునిరసన కార్యక్రమాలుఅధిష్టానం ఆదేశాలను పాటిస్తూవైయస్సార్సీపి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. తన కర్తవ్యాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఆయన సతీమణి స్వర్ణలత రాజకీయాలకు అతీతంగా పరిషత్ పాలన సాగిస్తున్నారు రానున్న స్థానిక పంచాయతి ఎన్నికలలో పార్టీ విజయానికి అదే విధంగా2029 లో తిరిగిముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అదే విధంగా కాకాణి గోవర్ధన రెడ్డి మంత్రిగా పూర్వ వైభవం సాధిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## వి.కోట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం భవన నిర్మాణానికి భూమిపూజ



**వి. కోట స్వర్ణ సాగరం జూన్04:**

చిత్తూరు జిల్లా వి.కోట: వి.కోట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోస్టుమార్టం సౌకర్యం త్వరలో అందుబాటులోకి రానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఇప్పటి వరకు వి.కోటలో పోస్టుమార్టం సౌకర్యం లేకపోవడంతో ప్రమాదాలు, అనుమానాస్పద మరణాల కేసుల్లో మృతదేహాలను పలమనేరుకు తరలించాల్సి వచ్చేది. దీంతో బాధిత కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టి పోస్టుమార్టం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఎన్. అమర్నాథ్ రెడ్డి ఆశీస్సులు, నూతన కమిటీ సభ్యులు ఆర్.ధీరజ్, సుకన్య, పద్మనాభం కృషి ఫలితంగా ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందని నాయకులు పేర్కొన్నారు. భవన నిర్మాణం పూర్తయిన అనంతరం వి.కోట ప్రభుత్వ ఆసుపత్రిలోనే పోస్టుమార్టం సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామన్న, రంగనాథన్న, రాంబాబు, సుబ్బన్న, ఆసుపత్రి డైరెక్టర్ ధీరజ్, డాక్టర్ మురళి, సతీష్, ముకుంద, లక్ష్మణ్, జనార్దన్ రెడ్డి, మురళి, నరేష్, విజయ్, ఉదయ్ కుమార్ తదితరులు ఈ పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ భవనం కీలక పాత్ర పోషిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వి. కోట. కవులకు యస్. పి. బాలు పురస్కారం



**వి.కోట స్వర్ణ సాగరం జూన్04:**

చిత్తూరు జిల్లా వి.కోట మండలం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య మరియు యం వి. కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్.. చిత్తూరు. ఆంధ్రప్రదేశ్. (ద.భా ) వారి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పురస్కారప్రధానం–2026 జరిగింది. ఈ కార్యక్రమం చిత్తూరు కట్టమంచి రోడ్ నందు కల యల్.జి.బి. టవర్స్ ఫంక్షన్ హాల్ నందు యస్. పి. బాలసుబ్రమణ్యం.. పుట్టినరోజు సందర్బంగా విశ్వ స్వర కర్త 'బాలు 'సంగీత వైభవం పై గీతాలాపన జరిగింది.ఈ సందర్బంగా వి కోటకు చెందిన డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం కవి, రచయిత., డాక్టర్ గడ్డం శాంతకుమారి, కవయిత్రి, విశ్రాంత ఉపాధ్యాయులు అయిన వీరు యస్ పి బాల సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సందర్బంగా జాతీయ పురస్కారం ప్రముఖుల నుండి సన్మానం, ప్రశంసాపత్రం మరియు పురస్కారజ్ఞాపిక ను అందుకున్నారు. ఈ కార్యాక్రమములోసంస్థ అధ్యక్షులు డాక్టర్ మర్రిపూడి దేవేంద్రరావు,డాక్టర్యంవి.శ్రీధర్రెడ్డి,డాక్టర్.సి.నారాయణస్వామి ,కె.వెంకటరెడ్డిజిల్లా జైలు సూపరెండెంట్ ,మిద్దెల హరి. రాజారత్నం మునీంద్ర, రాజ రత్నం,తోట గోవిందన్,హరినాథ్ రెడ్డి, మునీంద్ర తిరుపతి షాజహాన్ బాషా,లైన్స్ క్లబ్ సభ్యులు మరియు రాష్ట్ర నలుమూలల నుండి ఇతర సాహితీ మూర్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు - దద్దాల

### -సూపర్ సిక్స్ అమలులో కూటమి ఫెయిల్

### -మోసపూరిత హామీలతో జనం నడ్డివిరిచారు

**కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 04**






కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను వంచించిన చంద్రబాబు వైఖరికి నిరసనగా వైయస్ఆర్సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైస్సార్సీపీ ఆధ్వర్యంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" కనిగిరి నియోజకవర్గం అన్ని మండల కేంద్రాలలో ఈరోజు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు.అందులో భాగం పామూరు మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం పార్టీ కార్యాలయం నుండి పామూరు ఆర్టీసీ బస్టాండ్ వరకూ పార్టీ శ్రేణులతో కలిసి ఫ్లకార్డ్స్ తో నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దద్దాల నారాయణ యాదవ్ హాజరైయ్యారు. అనంతరం మీడియాతో దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ కూటమి రెండేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజల నడ్డివిరిచారని ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వం అధికార దాహంతో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలమైందన్నారు.అధికారంలోకి వచ్చి రెండేళ్లు ఒక్క కొత్త పింఛన్ కూడ మంజూరు చేయకపోగా 6 లక్షలకు పైగా పింఛన్లు తొలిగించిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.18 ఏళ్లు నిండిన మహిళలకు ఏడాదికి రూ. 15 వేలు,నిరుద్యోగభృతి నెలకు రూ. 3 వేలు లాంటి హామీలను తుంగలో తొక్కరన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఏమైందని నిలదీశారు.

మెడికల్ కళాశాలను మాజీ సీఎం జగనన్న తీసుకొస్తే నేడు చంద్రబాబు నాయుడు వాటిని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ చేతుల్లో పెట్టేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు.అన్న దాతలకు ఏటా రూ. 20 వేలు అని చెప్పి పంగనామాలు పెట్టారని మండి పడ్డారు.చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెట్టడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ పార్టీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు, సోషల్ మీడియా ఆక్టివిస్టపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు.మళ్ళీ ప్రజలకు మేలు జరగాలన్న,రాష్ట్రము అభివృద్ధి పథంలో నడవాలన్న మళ్ళీ జగనన్నను ముఖ్యమంత్రి గా చేసుకుందామని అందుకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో పామూరు మండల పార్టీ నాయకులు, గంగసాని లక్ష్మీ, గంగసాని హుస్సేన్ రెడ్డి,ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులకు భయపడం..








### -ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్తకు తన అండగా ఉంటా ...

### .- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి,

### -సమన్వయకర్త కృపా లక్ష్మి..

**శ్రీ రంగరాజపురం:స్వర్ణ సాగరం:జూన్ 4:**

ఖనిజ సంపదలతో పుష్కలంగా ఉన్న గంగాధర్ నెల్లూరు నియోజకవర్గాన్ని.... ఆ ఖనిజ సంపదను పూర్తిగా కొల్లగొట్టిన కూటమి నాయకులు చెట్లతో కలకలాడిన అడవులు... నేడు ఎడారిని తలపిస్తున్నాయి.గతంలో ఎన్నడు లేని విధంగా నియోజకవర్గంలో అవినీతి తారాస్థాయికి చేరుకున్నాయి.గతంలో అనేకమంది ఎమ్మెల్యేలు , ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, స్పీకర్ గా పని చేసిన వారు ఎవరు కూడా ఇలాంటి సాహసానికి ఒడి కట్టలేదు నేడు ఎక్కడ చూసినా మన ఖనిజ సంపదను తమిళనాడుకు తరలించి కోట్లును ఆర్జిస్తున్నారు.సంబంధిత విషయంపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, రెవెన్యూ యంత్రాంగానికి ఎన్నిసార్లు విన్నవించిన ప్రయోజనం శూన్యం.

**అందరూ ఒకటయ్యారు...** ఖనిజ సంపదను దోచుకుంటున్నారు... ఎక్కడెక్కడ దోచుకున్నారు అక్కడికి నేనే వెళ్తా... ప్రతి దోపిడీని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించి ప్రజలకు చూపిస్తా... కచ్చితంగా రానున్న జగనన్న ప్రభుత్వంలో అవినీతికి పాల్పడ్డ ఏ ఒక్కరిని వదిలి ప్రసక్తే లేదు.అన్యాయాలు ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అటెంప్ట్ మర్డర్... కేసులు నమోదు చేస్తున్నారు... ప్రతి పోలీస్ స్టేషను సందర్శిస్తా...ప్రజల కోసం ప్రజల సంక్షేమం కోసం ప్రజల బాగు కోసం ఎంత దూరమైనా పోరాటం చేస్తా.... ఎన్ని కేసులు పెట్టుకుంటారు పెట్టుకోండన్నారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు గురవారెడ్డి, ఎంపీపీ సరిత జనార్ధన్, మండల పార్టీ కన్వీనర్ మణి, తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గిరిజనుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



**స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్**

తిరుపతి జిల్లా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు మాసారపు సుబ్బయ్య తెలిపారు.ఈ సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సుబ్బయ్య, జిల్లాలోని గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గిరిజన గురుకుల పాఠశాలల్లో వసతులు మెరుగుపరచడంతో పాటు వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారికి అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించాలని కోరారు. ప్రతి గిరిజన కాలనీలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు రావాలని ఈ సందర్భంగా సుబ్బయ్య కోరారు.


## లయన్స్ క్లబ్ అడ్మిన్ గంగారి రమేష్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన లయన్ జూలియన్ రాజు







**రేణిగుంట స్వర్ణ సాగరం జూన్ 04**

రేణిగుంట జంక్షన్ లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ లయన్ గంగారి రమేష్ 50వ జన్మదినాన్ని పట్టణ లయన్ జూలియన్ రాజు ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజుని పురస్కరించుకొని లయన్ గంగారి రమేష్ కేక్ కట్ చేసారు. లయన్ జూలియన్ రాజు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. లయన్ జూలియన్ రాజు మాట్లాడుతూ పుట్టినరోజు జరుపుకుంటున్న లయన్ రమేష్ కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, మున్ముందు మరెన్నో ఉన్నత పదవుల్లో అలకరించాలని ఆ భగవంతుని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ రేణిగుంట సర్పంచ్ నాగేశం, ఎంపీటీసీ ఆనంద్, కోఆప్షన్ సభ్యులు అస్సన్ సాహెబ్ లు పాల్గొన్నారు.







# 'పెద్ది' మూవీ రివ్యూ అండ్ రేటింగ్

**టైటిల్ : పెద్ది**
**నటీనటులు: రామ్ చరణ్, జాన్వీ కపూర్, జగపతి బాబు, శివరాజ్ కుమార్, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ తదితరులు**
**నిర్మాత: సతీష్ కిలారు**
**సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్**
**రచన-దర్శకత్వం: బుచ్చిబాబు**
**సంగీతం: ఏఆర్ రెహమాన్**
**సినిమాటోగ్రఫీ: ఆర్.రత్నవేలు**
**ఎడిటింగ్: నవీన్ నూలి**
**విడుదల తేది: జూన్ 4, 2026**

గ్లింప్స్‌తోనే అంచనాలు పెంచేసిన చిత్రం 'పెద్ది'. గేమ్ ఛేంజర్ లాంటి డిజాస్టర్ తర్వాత రామ్ చరణ్ నుంచి వస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఉప్పెన లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఐదేళ్ల గ్యాప్‌తో బుచ్చిబాబు తీసిన సినిమా కూడా ఇదే. చాలా కాలం తర్వాత ఏఆర్ రెహమాన్ సంగీతం అదించిన తెలుగు చిత్రం ఇదే కావడం మరో ప్రత్యేకం. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది. మరి ఆ అంచనాలకు, ఆసక్తికి దీటుగా ఈ చిత్రం ఉందా? ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించింది? రివ్యూలో చూద్దాం.

**కథేంటంటే..**

1990 నేపథ్యంలో సాగే కథ ఇది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో కొండ కింద ఓ ఊరు ఉంటుంది. అక్కడ 450 కుటుంబాలు, 1800 మంది జనాభా ఉన్నా.. ఆ ఊరికి గుర్తింపే ఉండదు. ఆ ఊర్లో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తే గుర్తింపుతో పాటు కాలి నడక ప్రయాణం తప్పుతుందని, అదే ఊరికి చెందిన అప్పల సూరి(జగపతిబాబు) 30 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. మరోవైపు ఆ ఊరికి చెందిన యువకుడు పెద్ది(పెద్ది) కూలీ పని చేస్తూ.. డబ్బుల కోసం క్రికెట్ ఆడుతుంటాడు. ఆరు బంతులకు ఆరు సిక్సులు కొట్టడం ఆయన స్పెషాలిటీ. క్రికెట్‌లో విజయనగరం యువత మొత్తానికి ఫేవరేట్ అయిన పెద్ది..ఓ కారణంగా ఆ ఆటను వదిలేసి ప్రాణాలను పణంగా పెట్టి కుస్తీ నేర్చుకుంటాడు. గౌర్నాయుడు(శివరాజ్‌కుమార్) శిక్షణలో కుస్తీ పోటీల్లో నేషనల్ వరకు వెళ్తాడు. మరి నేషనల్ పోటీల్లో పెద్ది గెలిచాడా లేదా? తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్ ఆటను ఎందుకు వదుకోవాల్సి వచ్చింది? కుస్తీ, క్రికెట్‌తో పాటు మరో ఆట కూడా ఎందుకు ఆడాల్సి వచ్చింది? ఆ ఆట ఏంటి? అసలు పెద్ది లక్ష్యం ఏంటి? అది నెరవేరిందా లేదా? ఈ కథలో అచ్చీయమ్మ( జాన్వీ కపూర్), రామ్ బుజ్జి( దివ్యేందు శర్మ) పాత్రలు ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

**ఎలా ఉందంటే...**

గుర్తింపు కోసం ఓ యువకుడు చేసే క్రీడా పోరాటమే ఈ పెద్ది కథ. దర్శకుడు బుచ్చిబాబు స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ ఎమోషనల్ స్టోరీ రాసుకున్నాడు. స్పోర్ట్స్ డ్రామా అయినప్పటికీ ఈ కథలో ఓ ప్రత్యేకత ఉంది. హీరో ఒక ఆటకే పరిమితం కాడు. క్రికెట్‌తో తెరపై ఎంట్రీ ఇచ్చి, కుస్తీతో ఆకట్టుకొని, అథ్లెట్‌గా ప్రేక్షకుల హృదయాలను గెలుస్తాడు. మూడు విభిన్నమైన క్రీడల్ని తీసుకున్న బుచ్చి బాబు.. వీటి మధ్యలో ఓ ఎమోషనల్ కథ చెప్పాడు. ఆ కథ ఊహకందేలా సాగడమే ఇక్కడ కొంతవరకు మైనస్. అయితే రామ్ చరణ్ నటన, రెహమాన్ నేపథ్య సంగీతం ఆ మైనస్‌ని కొంతవరకు కప్పిపుచ్చాయనే చెప్పాలి.

2016లో కథ ప్రారంభం అవుతుంది. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కి కేవలం 2 ఒలింపిక్స్ పథకాలే రావడంతో క్రీడా శాఖ మంత్రి అధికారులపై సీరియస్ అవ్వడం.. వచ్చే పోటీల్లోపు మెరికాల్లాంటి కుర్రాళ్లను తయారు చెయమని ఆదేశించడం.. ఓ అధికారి(బోమన్ ఇరానీ) విజయనగరం రావడం.. అక్కడ పెద్ది పేరు విని..అతని గురించి తెలుసుకునేందుకు ఆ ఊరికి చెందిన ఓ వ్యక్తితో కలిసి ప్రయాణం చేసినప్పటి నుంచి అసలు కథ ప్రారంభం అవుతుంది. ఆ ఊరి వ్యక్తి పెద్దికి భారీ ఎలివేషన్ ఇస్తూ.. స్టోరీని ప్రారంభిస్తాడు. అయితే కేజీయఫ్ తర్వాత ఇలా హీరో కథని ఎలివేషన్ ఇస్తూ, ముక్కలు ముక్కలుగా చెప్పడం రొటీన్‌గా మారింది. అందుకే పెద్ది ప్రారంభం అంత ఆసక్తికరంగా అనిపించదు. ఎప్పుడైతే పెద్ది పాత్ర ఎంట్రీ ఇచ్చి గ్రౌండ్‌లో సిక్సర్ కొడతాడో.. అప్పటి నుంచి కథనం ఇంట్రెస్టింగ్‌గా సాగుతుంది. ఒకవైపు పెద్ది క్యారెక్టర్ ఎలా ఉంటుందో చెబుతూనే.. మరోవైపు అప్పల సూరి పాత్ర ద్వారా ఊరి సమస్య చూపించి.. అసలు సంఘర్షణ ఏంటనేది మొదటి నుంచే ప్రేక్షకుడికి అర్థమయ్యేలా చెప్పుకొచ్చాడు. అయితే అచ్చీయమ్మగా జాన్వీ ఎంట్రీ, ఎన్నికల ప్రచారం.. ముద్దు సీన్.. ఇవేవి అంతగా ఆకట్టుకోవు. అసలు కథకు ఈమె పాత్రకు సంబంధమే ఉండదు. జగపతి బాబు పాత్రకు సంబంధించిన సన్నివేశాలు ఎమోషనల్‌గా సాగుతాయి. పోలీస్ స్టేషన్ సీన్‌తో హీరో మెయిన్ ట్రాక్ ఎక్కుతాడు. ఇంటర్వెల్ సీన్ ని దర్శకుడు చక్కగా ప్లాన్ చేశాడు.

ఫస్టాఫ్ మొత్తం పక్కా కమర్షియల్ మీటర్‌లో తీర్చిదిద్దిన బుచ్చిబాబు.. సెకండాఫ్‌ని మాత్రం వాటిని పట్టించుకోకుండా చెప్పాల్సిన పాయింట్‌పై మాత్రమే ఫోకస్ పెట్టాడు. ద్వితియార్థంలో వచ్చే కుస్తీ ఎపిసోడ్స్ అన్ని ఆకట్టుకుంటాయి. ఒకవైపు కుస్తీ పోటీలు జరుగుతుండగానే కీలక మలుపు రావడంతో కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఢిల్లీ ఎపిసోడ్.. ప్రమోషన్స్‌లో చెప్పినంత గొప్పగా ఏమి ఉండదు. కానీ ఊరి గుర్తింపు కోసం హీరో తీసుకునే కఠిన నిర్ణయం మాత్రం హృదయాలను హత్తుకుంటుంది. క్రీడలకు సంబంధించిన ఎపిసోడ్స్ విషయంలో దర్శకుడు చాలా వరకు సినిమాటిక్ లిబర్టీ తీసుకున్నాడు. అయినా కూడా తెరపై సహజంగానే కనిపిస్తాయి. ప్రీక్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ వరకు కథనం ఎమోషనల్‌గా సాగుతుంది.

**ఎవరెలా చేశారంటే..**

రామ్ చరణ్ వన్ మ్యాన్ షో ఇది. క్రికెటర్‌గా, కుస్తీ ఆటగాడిగా, అథ్లెట్‌గా మూడు విభిన్నమైన పాత్రలతో కనిపించిన చరణ్..ప్రతి పాత్రలోనూ వేరియేషన్ చూపించి ఆకట్టుకున్నాడు. ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం ప్రతి ఫ్రేములోనూ కనిపిస్తుంది. అప్పల సూరి పాత్రతో జగపతి బాబు ఒదిగిపోయాడు. అయితే ప్రమోషన్స్‌లో ఇచ్చినంత ఎలివేషన్స్ మాత్రం సినిమాలో లేవు. కుస్తీ గురువు గౌర్నాయుడు పాత్రకు శివరాజ్‌కుమార్ న్యాయం చేశాడు. ఇక అచ్చియమ్మగా జాన్వీ కపూర్ తెరపై కనిపించేంది కాసేపే అయినా తనదైన నటనతో ఆకట్టుకుంది. తెరపై అందంగా కనిపించింది. కొన్ని చోట్ల ఆమె నటన అతిగా అనిపిస్తుంది. అలాగే అసలు కథకి ఆమె పాత్రకు సంబంధమే ఉండదు. హీరోయిన్ అన్నాక కథకు కొంత లింకు చేయాలి అన్నట్లుగా.. కొంతవరకు అలా చూపించారంతే. రామ్ బుజ్జిగా దివ్యేందుతో పాటు మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధిమేర నటించారు. సాంకేతికంగా సినిమా బాగుంది. ఏఆర్ రెహమాన్ నేపథ్య సంగీతం సినిమాకు మరో ప్రధాన బలం. పాటలు బాగున్నాయి. రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమా స్థాయిని పెంచేసింది. ఆర్ట్ డిపార్ట్‌మెంట్ పనితీరు బాగుంది. ఎడిటింగ్ పర్వాలేదు. నిర్మాణ విలువలు బాగున్నాయి.



## రవితేజ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్.. రాబోతున్న 'ఇరుముడి' పవర్‌ఫుల్ థీమ్ సాంగ్!

మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ (లష్టవ ఎమ్ఖతీ శీట ×తీబఎబఒఱ) ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టు 2026లో థియేటర్లలోకి రానుంది.

## ప్రశాంత్ నీల్‌కి జూనియర్ ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్..

### వైరల్ అవుతున్న పోస్ట్!



ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. "పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## యాక్షన్ కింగ్ ఇంట్లో పెళ్లి సందడి .. అర్జున్ సర్జా చిన్న కుమార్తె అంజనా వివాహంపై జోరుగా ప్రచారం





సౌత్ ఇండియన్ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా కుటుంబంలో త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆయన చిన్న కుమార్తె అంజనా సర్జా ఈ ఏడాది అక్టోబర్‌లో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అర్జున్ కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.కన్నడ చిత్రసీమలో హీరోగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన అర్జున్ సర్జా, తెలుగు మరియు తమిళ భాషల్లోనూ ఎన్నో విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. యాక్షన్ హీరోగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, నిర్మాతగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ఇక కుటుంబ పరంగా కూడా తన కుమార్తెలకు మంచి భవిష్యత్తు అందించిన తండ్రిగా ప్రశంసలు అందుకుంటున్నారు.తెలుగు వార్తలు అర్జున్ పెద్ద కుమార్తె ఐశ్వర్య సర్జా సినీ రంగంలో నటిగా రాణిస్తుండగా, చిన్న కుమార్తె అంజనా సర్జా మాత్రం పూర్తిగా భిన్నమైన రంగాన్ని ఎంచుకున్నారు. న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ పార్సన్స్ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో చదువుకున్న అంజనా ప్రస్తుతం ఫ్యాషన్ డిజైనర్‌గా, వ్యాపారవేత్తగా మంచి గుర్తింపు సంపాదించారు. ఆమె స్థాపించిన 'సా=జీూూ' బ్రాండ్ పర్యావరణహిత లగ్జరీ హ్యాండ్‌బ్యాగ్స్ తయారీలో ప్రత్యేక గుర్తింపు పొందింది. పండ్ల వ్యర్థాలు, యాపిల్, పైనాపిల్, కాక్టస్ వంటి సహజ పదార్థాలతో రూపొందించే ఈ బ్యాగ్స్ అంతర్జాతీయ మార్కెట్లో ఆదరణ పొందుతున్నాయి. వ్యక్తిగత జీవితానికి వస్తే, అంజనా గత 13 సంవత్సరాలుగా ఓ అమెరికన్ యువకుడితో ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. విదేశాల్లో చదువుకునే సమయంలో ప్రారంభమైన ఈ పరిచయం ప్రేమగా మారి, కాలక్రమేణా మరింత బలపడింది. గత ఏడాది ఇటలీలోని అందమైన పర్యాటక ప్రాంతం లేక్ కోమోలో కుటుంబ సభ్యుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. ఈ వేడుకను అత్యంత ప్రైవేట్‌గా నిర్వహించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.ప్రస్తుతం సోషల్ మీడియాలో వినిపిస్తున్న కథనాల ప్రకారం, అంజనా మరియు ఆమె కాబోయే జీవిత భాగస్వామి అక్టోబర్ నెలలో వివాహం చేసుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పెళ్లి ఏర్పాట్లు కూడా ప్రారంభమైనట్లు కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తలపై అర్జున్ సర్జా కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక క్లారిటీ రాలేదు.